ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (శుక్ర)
సహరి : 4:49 (శని)


పిఠాపురంలో సిద్ధమైన సభా ప్రాంగణం





నేడే జయకేతనం

పిఠాపురం సభ కోసం..

- కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడలో శుక్రవారం జరగనున్న జనసేన ఆవిర్భావ సభ జయ కేతనంకు భారీ ఏర్పాట్లు చేశారు.
- రెండు తెలుగు రాష్ట్రాల నుంచి లక్షల మంది హాజరుకానున్నారు.
- మధ్యాహ్నం మూడు గంటల నుంచి రాత్రి పది గంటల వరకు సభ నిర్వహిస్తారు.
- అధినేత పవన్ అమరావతి నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు సభా ప్రాంగణం సమీపంలోని హెలీప్యాడ్‌లో దిగుతారు.
- జనసేన ఆవిర్భావం, నేపథ్యం, పోరాటాలు, సిద్ధాంతాలు.. విజయపథం వరకు సాగిన ప్రస్థానాన్ని పవన్ వివరిస్తారు.
- 24 ఎకరాల విస్తీర్ణంలో సభ నిర్వహిస్తున్నారు. 14 ఎకరాల్లో ఏడు గ్యాలరీలు ఏర్పాటు చేసి రెండు లక్షల మంది కూర్చొనేందుకు ఏర్పాట్లు చేశారు.
- సభావేదిక మొదటి వరసలో డిప్యూటీ సీఎం పవన్, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఆసీనులవుతారు.
- మిగిలిన రెండు వరుసల్లో 250 మంది ఆహ్వానితులు కూర్చుంటారు.
- సభా ప్రాంగణంలో 20కి పైగా ఎల్ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేసి, 75 సీసీ కెమేరాలు, 15 డ్రోన్లతో నిఘా పెట్టారు.
- నాలుగు కిలోమీటర్ల మేర ఆడియో వినబడేలా మైక్‌లు అమర్చారు.
- బందోబస్తుకు ఏలూరు రేంజ్ పరిధిలోని స్టేషన్ల నుంచి 1700 మంది పోలీసులను రప్పించారు.
- సభకు వచ్చి, వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు.
- సభా ప్రాంగణంలో తాగు నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, బిస్కెట్లు అందించనున్నారు.
- ఐదు వైద్య బృందాలను 20కిపైగా అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు.
- సభకు తరలివచ్చే వాహనాల కోసం కాకినాడ వైపు ఐదు, పిఠాపురం వైపు నాలుగు పార్కింగ్ ప్లేసులు గుర్తించారు.
- కాకినాడ-కత్తిపూడి మధ్య ఆవిర్భావ సభకు వచ్చే వాహనాలు తప్ప మిగిలిన వాటిని దారి మళ్లిస్తున్నారు. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి వరకూ ఆర్టీసీ బస్సులను నిలిపివేశారు.

జనసేన.. 12 ఏళ్ల రాజకీయ ప్రస్థానం. 2014 మార్చి 14వ తేదీన హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ పార్టీని స్థాపించారు. అప్పటి నుంచి జనం మధ్యే ఉండాలన్నదే ఆ పార్టీ ఆశయం. దీనికి అణుగుణంగానే అడుగులు వేసింది, ఎత్తుగడలు వేసింది, పక్కా కార్యాచరణతో ముందుకురికింది. అవినీతికి తావు లేకుండా వ్యవస్థలు ఉండాలన్న నినాదంతో గొంతెత్తింది. ఇన్నాళ్లు ఆ పార్టీ అనేక రాజకీయ ఒడిదుడు కులు ఎదుర్కొంది. పరాజయాలను మూటకట్టుకుంది. కాని ఇప్పుడు అదేచోట విజయాలు అందుకుని జన ధరహాసం చేస్తోంది. నేడు వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

- జనసేన సుదీర్ఘ రాజకీయ ప్రయాణం.. పరాజయం ఎదురైనా మడమ తిప్పని ఆశయం..
- ఇప్పుడు విజయాల మూట కట్టుకుని ఉత్సాహం.. పిఠాపురంలో ఆవిర్భావ దినోత్సవ సభకు పయనం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి పశ్చిమ గోదావరిలో జనసేన ఆవిర్భావం నాటి నుంచి ఇప్పటి వరకు రాజకీయంగా కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నా ఎక్కడా పార్టీ కేడర్ తగ్గనేలేదు. మిగతా పార్టీల కంటే భిన్నంగా తమదైన శైలిలో జనం మధ్యనే ఉన్నారు. గత ఐదేళ్లలో జగన్ పార్టీ వ్యవహార శైలిని పవన్‌కల్యాణ్ నిలదీశారు. అదే ఉత్సాహంతో కిందిస్థాయి కేడర్ సైతం ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో జగన్ పార్టీకి ఎదురొడ్డి నిలిచింది. వీరిలో కొంతమందిపై పోలీసులు కేసులు బనాయించినా ఎక్కడ వెనక్కి తగ్గలేదు.

పరాజయం ఎదురైనా..

2019 ఎన్నికల్లో పార్టీ అధ్యక్షుడు పవన్ భీమవరంలో ఓటమి చెందారు. ఇది అనూహ్య పరిణామం. అయినా ఓటమి నుంచే మరిన్ని గుణపాఠాలు నేర్చుకున్నారు. ఉమ్మడి పశ్చిమలో పార్టీ నాయకత్వం పటిష్ఠంగా మారేలా ప్రత్యేక కార్యాచరణకు దిగారు. క్షేత్రస్థాయిలో ఆటంకాలున్నా వెనుతిరిగి చూడలేదు. పార్టీపై సామాజిక ముద్రవేసి కొందరు జనసేన ప్రతిష్ఠను దెబ్బ తీయాలని చూసినా కంగారు పడలేదు. పార్టీ ఆదేశమే శిరోధార్యంగా అనేక కార్యక్రమాలు చేయగలిగారు. జనాన్ని కూడగట్టుకోగలిగారు. ఇదే తరుణంలో నియోజకవర్గాల వారీగా తమ పార్టీ స్థాయి ఏమిటో, ఎదగాల్సిన తీరు ఏమిటో క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఒక దశలో జనసేన ఏ వైపు కదులుతుందో అన్న సందిగ్ధత వెన్నాడినా 2024 ఎన్నికల్లో చంద్రబాబుతో కలిసి ప్రయాణించాలన్న నిర్ణయం ఆ పార్టీ రూపు రేఖలనే మార్చేసింది. 2019 నాటి పరాజయాన్ని అలవోకగా అధిగమించడానికి దారితీసింది.

ఫలించిన పక్కా వ్యూహం

తమ సొంత జిల్లా పశ్చిమలో ఏదో రూపంలో బలంగా ఎదగాలని ఒకప్పటి చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం ఆశించినా అప్పట్లో నెరవేరలేదు. జనసేనాని పవన్‌కల్యాణ్ నేతృత్వాన్న అంచలంచెలుగా పన్నెండేళ్ల వ్యవధిలోనే ఏకంగా ఆరు అసెంబ్లీ స్థానాల్లో పార్టీ ఎమ్మెల్యేలను గెలిపించుకో గలిగారు. తమకు బాగా పట్టున్న ఉభయ గోదావరి జిల్లాల్లో తగినన్ని సీట్లు కావాల్సిందేనని పవన్ 2024లో పట్టుబట్టడం దానికి తెలుగుదేశం నాయకత్వం అంగీకరించడం, బీజేపీ అండగా నిలవడంతో గోదావరి రాజకీయాల్లో దూసుకుపోయారు. ఉమ్మడి పశ్చిమలో నరసాపురం, భీమవరం, నిడదవోలు, తాడేపల్లిగూడెం, పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో పార్టీ పక్షాన పోటీ చేసిన అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఇప్పుడు శాసనసభలో పార్టీ పక్షాన ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గళం విన్పిస్తున్నారు. పర్యాటక మంత్రిగా నిడదవోలు నుంచి కందుల దుర్గేశ్ కీలకంగా మారారు. భీమవరం నుంచి గెలిచిన అంజిబాబు అసెంబ్లీ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్‌గా మరో కీలక బాధ్యతను అందుకోగలిగారు. వీరితోపాటు ఆర్టీసీ రీజనల్ చైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా కనకరాజు సూరి సైతం జనసేన పక్షానే పూర్తిగా ఎదిగారు. పశ్చిమ రాజకీయాల్లో జనసేన తగు ప్రాధాన్యత సంతరించుకోగలిగింది. వాస్తవానికి కూటమి ప్రభుత్వంలో జనసేన వ్యవహరిస్తున్న తీరు ఇప్పటికే ఆ పార్టీకి ప్లస్ మార్కుగానే మారింది. గోదావరి జిల్లాల్లో ఈ ఏడాదే అత్యధికంగా సభ్యత్వ నమోదులో లభించడం ఆ పార్టీ క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా మారిందన్న సంకేతాలు ఇచ్చింది.

పార్టీ శ్రేణులకు పవన్ దిశా నిర్దేశం

జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిఠాపురంలో జరిగే అవిర్భావ సభ ద్వారా దిశా నిర్దేశం చేస్తారు. ఇప్పటి వరకు ఎలా పోరాడాలో చెప్పారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయ్యి ప్రజలకు ఎలా సేవ చేయాలో చూపించి మన్ననలు పొందారు. రానున్న రోజుల్లో పార్టీ శ్రేణులు ఎలా పనిచేయాలో ఈ సభ ద్వారా దిశానిర్దేశం చేస్తారు.శుక్రవారం పిఠాపురంలో జరిగే అవిర్భావ సభకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి దాదాపు 50 వేల మంది తరలి వెళ్లనున్నారు.

\- కొటికలపూడి గోవిందరావు(చినబాబు),
జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

పన్నెండేళ్ల ప్రజా పోరాటాలకు అనుగుణంగానే జనసేన జనం మధ్యలో నిలిచింది.

అంతా చిత్రాడ వైపే..

జనసేన ఆవిర్భావ దినోత్సవాన్ని నేడు కాకినాడ జిల్లాలోని పవన్ సొంత నియోజకవర్గమైన పిఠాపురంలోని చిత్రాడ వద్ద ఘనంగా నిర్వహించేందుకు ఆ పార్టీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే పార్టీ సీనియర్లంతా నియోజకవర్గాల్లో పర్యటించారు. పార్టీ సీనియర్ నేత, మంత్రి నాదెండ్ల మనో హర్ పార్టీ కేడర్‌కు దిశ నిర్దేశం చేశారు. జనసేన జిల్లా అధ్యక్షుడు చినబాబు నియోజకవర్గాల వారీగా ఏ స్థాయిలో కేడర్ తరలి వెళ్తున్నది ఆరా తీశారు. మొత్తం మీద పార్టీ ఆవిర్భావోత్సవం నేతలు, కేడర్‌లో సరికొత్త జోష్ నింపింది.


పదో తరగతి రూట్ ఆఫీసర్లకు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లకు ఈదర సుబ్బమ్మదేవి పాఠశాలలో సూచనలు ఇస్తున్న అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్

సర్వం సిద్ధం

జిల్లాకు చేరుకున్న 'పది' ప్రశ్నపత్రాలు



అశోకవర్ధన్ మున్సిపల్ స్కూల్‌లో టెన్త్ ప్రశ్న పత్రాలను భద్రపరుస్తున్న సిబ్బంది

ఏలూరు అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలవిద్యలో తుదిఅంకమైన పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 17 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు జరిగే టెన్త్ పరీక్షల ప్రశ్న పత్రాలు గురువారమే జిల్లా కేంద్రానికి చేరుకోగా, రెండు డతల్లో వీటిని శుక్ర, శనివారాల్లో జిల్లాలో పరీక్షలు జరిగే కేంద్రాల సమీప 31 పోలీసు స్టేషన్లకు తరలించి భద్రపరిచేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. మరోవైపు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించే చర్యల్లో భాగంగా గురువారం ఏలూరు సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్లు, కస్టోడియన్లతో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ శ్రీకాంత్ సమావేశం నిర్వహించారు. ఎక్కడైనా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదైతే రాజీ పడవద్దని కేసు బుక్ చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రంలోకి కేవలం చీఫ్ సూపరింటెండెంట్‌కు మాత్రమే ప్రభుత్వం ఇచ్చిన బేసిక్ సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లేందుకు అనుమతి ఉందన్నారు. జిల్లాలో ఎస్ఎస్‌సీ పరీక్షల ఏర్పాట్లపై ముఖ్యాంశాలు క్లుప్తంగా ఇలా..

- తొలిసారిగా ఈ ఏడాది రెగ్యులర్ విద్యార్థులతోపాటే, ఓపెన్ స్కూల్స్ దూరవిద్య పదో తరగతి పరీక్షలు ఏకకాలంలో జరుగుతున్నాయి. జిల్లాలో రెగ్యులర్ విభాగంలో 25,179 మంది విద్యార్థులు (వన్స్ ఫెయిల్డ్ సహా) దరఖాస్తు చేసుకున్నారు. ఓపెన్ స్కూల్స్ దూరవిద్య విభాగంలో మొత్తం 793 మంది బాలబాలికలు దరఖాస్తు చేసుకున్నారు.
- రెగ్యులర్ విద్యార్థుల కోసం 133, దూర విద్య విద్యార్థుల కోసం 17 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెగ్యులర్ పరీక్ష కేంద్రాల్లో కైకరం, రంగాపురం, లక్కవరం, కొరుకొల్లు, టి.నరసాపురం జడ్పీ హైస్కూళ్లు, జీలుగుమిల్లి ఏపీ ట్రైబల్‌వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ స్కూలు పరీక్ష కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు.
- ఎంపిక చేసిన కేంద్రాల్లో సీసీ కెమెరాలను అమర్చారు. మూల్యాంకనం ముగిసి ఫలితాలు వెల్లడైన ఆరు నెలల వరకు ఫుటేజిని భద్రపరుస్తారు.
- పరీక్షల నిర్వహణ నిమిత్తం 133 మంది చొప్పున సీఎస్‌లు, డీవోలు, 62మంది కస్టోడియన్లు, 20మంది రూట్ ఆఫీసర్లు, 22మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు, 1120 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.
- పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతుంది. గుర్తించిన రూట్లలో ఆర్టీసీ బస్సుల వేళలను రీషెడ్యూల్ చేశారు.
- మూల్యాంకన ప్రక్రియ ఏప్రిల్ 3నుంచి 9వ తేదీవరకు ఏలూరు సెయింట్ గ్జేవియర్ హైస్కూలులో జరుగుతుంది.

ప్రశాంతంగా పరీక్ష రాయండి..

ఉదయం 8.30 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. ప్రశ్నపత్రాన్ని సమగ్రంగా చదివి బాగా తెలిసిన వాటికే జవాబులు రాయాలి. టెన్షన్‌కు గురి కానవసరం లేదు. ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 84669 74001కు సంప్రదించవచ్చు.

\- ఎం.వెంకటలక్ష్మమ్మ, డీఈవో

17 నుంచి ఒంటిపూట బడులు

వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ఈనెల 17 నుంచి ఒంటిపూట బడుల విధానం అమలవుతుందని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పాఠశాలలు పని చేస్తాయని, పదో తరగతి పరీక్ష కేంద్రాలున్న పాఠశాలలు ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు పని చేస్తాయన్నారు.


పెదవేగి సచివాలయంలో వీఆర్వో కోసం ఎదురు చూపులు


తంగెళ్లమూడి సచివాలయంలో అరకొరగా ఉన్న సిబ్బంది

సర్వేకు వెళ్లారట!

ఆంధ్రజ్యోతి విజిట్

ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు

- అరకొరగా సిబ్బంది విధులకు హాజరు
- అధికశాతం సిబ్బంది క్షేత్రస్థాయి సర్వేల్లో నిమగ్నం
- అందుబాటులో లేక వెనుదిరుగుతున్న ప్రజలు

ఏలూరు టూటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సచివాలయాల్లో సిబ్బంది ఉండరు. ఉన్నవారు సమయానికి రారు. వాస్తవానికి పది గంటలకు సిబ్బంది సచివాలయాల్లో విధులకు హాజరు కావాలి. కానీ 10:30, 11:00 గంటలకు వస్తారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే 'ప్రభుత్వం సర్వేలన్నీ మా మీదే పెట్టింది. ఇంటింటికి వెళ్లి సర్వేలు నిర్వహిస్తున్నాం. మార్చి కావడంతో ఆస్తి, కుళాయి పన్నులు, కట్టించుకోవడానికి ఇంటింటికీ తిరుగుతున్నా' మంటూ దబాయించి చెబుతున్నారు. మరోవైపు సచివాలయాల వద్ద కనీసం మంచి నీటి సౌకర్యం కూడా లేక పనుల మీద వచ్చే జనం ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాల వద్ద స్వచ్ఛభారత్ ఊసే కానరావడం లేదు. గురువారం 'ఆంధ్రజ్యోతి' సచివాలయాల విజిట్‌లో పలు అంశాలు వెలుగు చూశాయి.

సిబ్బంది అంతా సర్వేల్లోనే..

ఏలూరులోని తంగెళ్లమూడి ఎంఆర్‌సీ కాలనీలో 1, 2, కొత్తపేటలోని 18, 22 నంబర్ల సచివాలయాలను 'ఆంధ్రజ్యోతి' ఉదయం 10 గంటల నుంచి విజిట్ చేసింది. ఎంఆర్‌సీ కాలనీలో 1, 2 సచివాలయాలు ఒకే భవనంలో ఉన్నాయి. ఈ రెండు సచివాలయాల్లో 18 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తూ కన్పించారు. 11 గంటలు దాటినా ఎవరూ రాలేదు. మిగిలిన వారు ఎక్కడా అని అడిగితే అవుట్‌డోర్ సర్వేలో ఆస్తిపన్నుల కలెక్షన్‌లో ఉన్నారని సిబ్బంది తెలిపారు. కొత్తపేట 18వ నంబర్ సచివాలయానికి 10.45 నిమిషాల వరకు తాళాలు వేసే ఉన్నాయి. అనంతరం ఎడ్యుకేషన్ సెక్రటరీ వచ్చి తాళాలు తీశారు. మిగిలిన సిబ్బంది గురించి అడగగా వారంతా అవుట్‌డోర్‌లో ఆస్తిపన్నుల వసూలు చేస్తున్నారని సమాధానమిచ్చారు. 22 సచివాలయంలో తొమ్మిది మంది సెక్రటరీలకు నలుగురే ఉన్నారు. 10.30 గంటల తర్వాత అడ్మిన్ సెక్రటరీ వచ్చారు.

వేచి ఉండాల్సిందే..

పెదవేగి : పెదవేగి సచివాలయానికి ఉద్యోగులు సకాలంలోనే హాజరయ్యారు. కాని సర్వేలతో కార్యాలయాన్ని వీడారు. దీంతో వివిధ పనులపై వచ్చిన ప్రజలు సిబ్బంది లేకపోవడంతో వేచి ఉండే పరిస్థితి ఉంది. పెదవేగి సచివాలయంలో గ్రామ కార్యదర్శితో పాటు మొత్తం ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారు. వీఆర్వో పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలలో జరు గుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ఉన్నారు. దీంతో వీఆర్వో కోసం వచ్చిన రైతులకు ఇబ్బందులు తప్పలేదు.

రెండు సచివాలయాలకు ఒకే చిన్న గది

ముదినేపల్లి : ముదినేపల్లి మేజర్ పంచాయతీలో రెండు గ్రామ సచివాలయాలు ఉన్నప్పటికీ సిబ్బంది అరకొరగానే ఉన్నారు. సచివాలయం -1, సచివాలయం -2 కార్యాలయాలు రెండింటిని పంచాయతీ కార్యాలయంలోనే చాలీచాలని గదుల్లో నిర్వహిస్తుండడంతో సిబ్బందితో పాటు ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెండు సచివాలయాలకు సంబంధించిన 20 మంది ఉద్యోగుల్లో సగం మంది బదిలీలపై వెళ్లిపోగా వారి స్థానాలను భర్తీ చేయలేదు.


ముదినేపల్లిలో ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్న రెండు సచివాలయాల ఉద్యోగులు

ప్రజలకు అందని సేవలు..

ముసునూరు : ముసునూరులో గ్రామ సచివాలయాలు రెండు ఉన్నాయి. సచివాయం-1లో నలుగురు, రెండులో ఐదుగురు సిబ్బంది ఉన్నారు. ప్రభుత్వం చేపట్టిన వర్క్ ఫ్రమ్ హోం సర్వే, పేదల కుటుంబాల నిర్ధారణ సర్వేలను గ్రామ సర్వేయర్, ఏఎన్ఎం మినహా మిగిలిన ఏడుగురు చేస్తున్నారు. దీంతో సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సమస్యలు, ఇతర పనుల కోసం వచ్చే ప్రజలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సచివాలయాల్లో మంచినీటి సౌకర్యం లేదు.

ప్రతిరోజు ఖాళీగానే ..

జంగారెడ్డిగూడెం,(ఏలూరు) : జంగారెడ్డిగూడెం సచివాలయాలు ప్రతిరోజు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. ఉద్యోగులు కార్యాలయానికి రాకుండానే తమ విధులు నిర్వహిస్తున్నారు. సర్వేల పేరుతో సచివాలయంలో ఉండే ఉద్యోగులంతా ఫీల్డ్‌కు వెళ్లిపోతుండడంతో సచివాలయానికి వచ్చే ప్రజలకు సమాధానం చెప్పే నాథుడే కరువయ్యారు. సచివాలయాలకు వచ్చే ప్రజలు సిబ్బంది ఎవరూ లేకపోవడంతో చేసేది లేక వెనుతిరుగుతున్నారు. మరోవైపు కార్యాలయాల వద్ద మంచినీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయడంలేదు. కనీసం సచివాలయాల్లో పరిశుభ్రత పాటించడంలేదు. స్వచ్ఛ భారత్‌ను సచివాలయాల్లో ఏమాత్రం అమలు పరచడం లేదు. పట్టణంలో ఉన్న పది సచివాలయాలలో ఇదే పరిస్థితి. సచివాలయాల్లో ఉన్న కంప్యూటర్లు ప్రింటర్లు పనిచేయక పోవడంతో మూలన పడేశారు.


సిబ్బంది లేక ఖాళీగా జంగారెడ్డిగూడెంలోని ఆరో నంబర్ సచివాలయం

అసంపూర్తి గృహ నిర్మాణాలను పూర్తి చేయండి : కలెక్టర్

ఏలూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నిర్మిస్తున్న గృహ నిర్మాణాల్లో అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేయడానికి అదనపు నిధులను ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందని, ఈవిషయంలో లబ్ధిదారులకు వివరించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి గృహనిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి టెలికాన్ఫరెన్స్‌లో ఆమె సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, హౌసింగ్ అధికారులతో గురువారం సమీక్షించారు. పీఎంఏవై 1.0 కింద ఇళ్లు మంజూరై వివిధ దశల్లో ఉన్న బీసీ,ఎస్టీ, ఎస్సీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందిస్తుందని, దీనిపై అవగాహన కల్పించాలన్నారు. డీఆర్వో విశ్వేశ్వరరావు,హౌసింగ్ పీడీ సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే జిల్లాలో ఈ నెల 15న ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంపై ఆమె టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో ఈ కార్యక్రమం వివరాలను నమోదు చేయాలని తహసీల్దార్లకు సూచించారు. మిస్సింగ్ ఎంప్లాయీస్ డేటా ఎంట్రీపై సమీక్షించారు.

రేపు తణుకులో సీఎం చంద్రబాబు పర్యటన

3

- ఏర్పాట్లను పరిశీలించిన పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ


టెన్నిస్ పోటీల వివరాలను వెల్లడిస్తున్న కాస్మో పాలిటన్ క్లబ్ సభ్యులు

భీమవరంలో రేపటి నుంచి ఆలిండియా ర్యాంకింగ్ టెన్నిస్ పోటీలు

భీమవరం అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఈనెల 15 నుంచి 21 వరకు ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని క్లబ్ కార్యదర్శి పెన్మెత్స వెంకట రామరాజు, వీవీ సుబ్రహ్మణ్య వర్మలు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి టోర్నమెంట్ వివరాలను వెల్లడించారు. పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన 220 మంది క్రీడాకారులు పాల్గొంటారని, మెన్స్ డబుల్స్ 35+,45+,55+, 65+,70+,75+ విభాగంలో ఈ టోర్నమెంట్ జరుగుతాయన్నారు.పోటీలను వెర్టెక్స్ హోమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వర్మ, క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన వారికి లక్ష రూపాయల నగదు అందించనున్నట్టు వివరించారు. 15,16 తేదీల్లో క్వాలిఫయింగ్ పోటీలు, 17 నుంచి 21 వరుకు ప్రధాన పోటీలు జరుగుతాయన్నారు. క్లబ్ సభ్యులు ఎం.సుబ్బరాజు, కె.సత్యనారాయణమూర్తి, సెక్రటరీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


బ్రోచర్ అవిష్కరించిన కళాపరిషత్ సభ్యులు

24 నుంచి వీరవాసరంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు

వీరవాసరం (భీమవరం టౌన్) మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం నిర్వహిస్తున్న అఖిల భారత స్థాయి నాటిక పోటీల బ్రోచరు గురువారం ఆవిష్కరించారు. పోటీల్లో పాల్గొనే కళా పరిషత్తుల నాటికల వివరాలను తెలియజేస్తూ పుస్తకాన్ని విడుదల చేశారు. వీరవాసరం కళాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గుండా రామకృష్ణ మాట్లాడుతూ కరోనా కారణంగా నాలుగు సంవత్సరాల నుంచి కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించే నాటికల పోటీలను నిలిపివేశామన్నారు. ఈ ఏడాది ఈనెల 24 నుంచి 27వ తేదీలలో నాలుగు రోజుల పాటు తిరిగి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పాలా అంజనేయులు, ఆకుల లీలా కృష్ణ, గుండా మురళీకృష్ణ పాల్గొన్నారు.

సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్ర

ఏలూరు క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ సౌత్ సెంట్రల్ జోన్ సప్త జ్యోతిర్లింగాలను దర్శించేలా భారత గౌరవ్ టూరిస్టు రైలును నడుపుతోందని ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎ.రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ఏప్రిల్ 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకూ 11 రాత్రిళ్ళు, 12 పగళ్ళు పర్యటన కొనసాగుతుంది. ఈ రైలు విజయవాడ నుంచి ఖమ్మం, ఖాజీపేట, సికింద్రాబాద్ మీదుగా వెళుతుంది. ఉజ్జయిని, మహా కాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారక (నాగేశ్వర్), సోమనాధ్ (సోమనాథ్), పూణే (భీమశంకర్), నాసిక్ (త్రయంబకేశ్వరుడు), ఔరంగాబాద్ (గ్రీష్మేశ్వర్) ప్రాంతాల్లో దర్శనాలు చేయిస్తారు. స్లీపర్ క్లాస్ పెద్దలకు రూ.20,890, పిల్లలకు 19,555, త్రి టైర్ ఏసీ పెద్దలకు 33,735, పిల్లలకు 32,160, టుటైర్ ఏసీ పెద్దలకు 44,375, పిల్లలకు 42,485 ధర నిర్ణయించారు. టిక్కెట్లు కావాల్సిన వారు విజయవాడ ఐఆర్‌సీటీసీ సెల్ నెంబర్ 92814 95848లో సంప్రదించవచ్చు.


శృంగ వృక్షం రైల్వే గేటు వద్ద ట్రాఫిక్ జామ్

శృంగవృక్షం వద్ద మొరాయించిన రైల్వే గేటు

పాలకోడేరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : భీమవరం నుంచి పాలకొల్లు వెళ్లే జాతీయ రహదారిపై శృంగవృక్షం వద్ద రైల్వే గేటు మొరాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నరసాపురం వైపు నుంచి భీమవరం వైపు గురువారం ఉదయం 10.30 గంటల సమయంలో పాసింజర్ రైలు వెళ్లే సమయంలో రైల్వే గేటు వేశారు. అయితే ఈ గేటు తెరిచే సమయంలో పది నిముషాలపాటు మొరాయించింది. జాతీయ రహదారి కావడం, ఆపై ఎండలు ముదరడంతో ప్రయాణికులు ఇదేమి బాధరా బాబు అంటూ ఎండలోనే కొద్ది నిముషాల పాటు ఉండవలసిన పరిస్థితి వచ్చింది. శృంగవృక్షం వద్ద తరచూ రైల్వే గేటు మొరాయిస్తూండటంతో స్థానికులతో పాటు వాహనదారులు నానా పాట్లు పడుతున్నారు. ఇదేం నరకం అంటూ తిట్టుకుంటున్నారు.

సంపద కేంద్రాలకు స్వస్తి !

ఎక్కడికక్కడ నిరుపయోగంగా ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలు

రహదారుల వెంబడే చెత్త డంపింగ్

పాలకోడేరు,మార్చి 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు ఆదాయాన్ని కల్పించేందుకు గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తలపెట్టిన ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాలు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో ఎందుకూ పనికి రాకుండాపోయాయి. పాలకోడేరులో సుమారు 13 సంవత్సరాల క్రితం ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించారు. కానీ దాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారు. ఈ ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాల వల్ల మంచి ఉపయోగాలే ఉన్నాయి. ప్రతి ఇంటికీ వెళ్ళి గ్రామాల్లోని పంచాయతీ పారిశుధ్య కార్మికుల ద్వారా రిక్షాల్లో తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా వేసుకుని ఆ చెత్తను డంపింగ్ యార్డు వద్ద ఉన్న తొట్టెల్లో ఆరబెట్టవలసి ఉంది. అందుకు ప్రతి ఇంటింటికి ప్రభుత్వం ద్వారా ఒక పచ్చ రంగు టబ్, ఒక నీలం రంగు టబ్ సరఫరా కూడా చేశారు. కానీ పంచాయతీ కార్మికులు ఆ చెత్తను డంపింగ్ యార్డులో వేయడం మానేసి రహదారి వెంబడి వేయడంతో రహదారులే డంపింగ్ యార్డులుగా మారిపోయాయి.


పాలకోడేరు, మోగల్లు రోడ్డులో చెత్తాచెదారం

ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణతో పంచాయతీకి ఆదాయం

ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన తొట్టెలలో ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా వేసి తడిచెత్తను ఎరువుగా తయారు చేసి కేజీల లెక్కన అమ్మడంతో పాటు పొడిచెత్తను ఆదాయం తెచ్చుకునే విధంగా తయారు చేసేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆచరణలోకి మాత్రం రావడం లేదు. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే కనిపిస్తోంది. పంచాయతీలకు వచ్చే ఆదాయం కూడా రాకుండాపోయింది. పాలకోడేరులోని డంపింగ్ యార్డు పరిస్థితి చాలా దారుణంగా ఉంది. చెత్తసేకరణలో భాగంగా ఏర్పాటు చేసిన తొట్టెలు పగిలిపోయి పిచ్చిమొక్కలు మొలిచి ఉన్నాయి. ఈ డంపింగ్ యార్డులో విద్యుత్ సౌకర్యం కూడా లేకపోవడంతో అక్కడ నివసించే పారిశుధ్య కార్మికుల పరిస్థితి దయనీయంగా ఉంది.

ఆంధ్రజ్యోతి ప్రాబ్లమ్ జోన్



పాలకోడేరులో నిరుపయోగంగా ఉన్న ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం

డంపింగ్ యార్డు వినియోగంలోకి వచ్చేలా అవగాహన కల్పిస్తున్నాం

పాలకోడేరు మండలంలోని డంపింగ్ యార్డులను వినియోగంలోకి తెచ్చేవిధంగా మండలంలోని 14 గ్రామాల్లో ప్రతి నెలా మూడో శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పారిశుధ్యాన్ని మెరుగుపరిచి పంచాయతీలకు ఆదాయాన్ని తెచ్చేవిధంగా డంపింగ్ యార్డులను వాడుకలోకి తీసుకువస్తాం.

- రెడ్డియ్య, ఎంపీడీవో, పాలకోడేరు

ట్యాంకుల శుభ్రత పట్టదా ?

రక్షిత నీటి సరఫరాపై నిర్లక్ష్యం

అత్తిలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో దాహం తీర్చడానికి నిర్మించిన ట్యాంకుల శుభ్రతను అధికారులు గాలికి వదిలేశారు. ట్యాంకుల నిర్వహణ, క్లోరినేషన్‌పై దృష్టి పెట్టడం లేదు. పల్లె ప్రజలకు రక్షిత నీరందక రోగాల బారిన పడుతున్నారు. ప్రజారోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని అధికారులను ఆదేశించినా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. క్షేత్రస్థాయిలో యంత్రాంగం పర్యటించి రక్షిత నీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.


మంచిలిలో రక్షిత నీటి ట్యాంకు

శుద్ధి చేసేదెవరు ?

అత్తిలి మండలంలో 18 గ్రామాలున్నాయి. 10 మేజరు, 8 మైనర్ గ్రామ పంచాయతీలున్నాయి. సాధారణంగా ట్యాంకులకు నీటిని నింపిన ప్రతిసారి 10 వేల లీటర్లకు 25 నుంచి 40 గ్రాముల బ్లీచింగ్ వాడి క్లోరినేషన్ చేయాలి. కానీ ఎక్కడా ఆపరిస్థితి లేదు. పంచాయతీలకు కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను గతంలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్ బిల్లుల బకాయి, క్లాప్ మిత్రల వేతనాలకు మళ్ళించింది. ఫలితంగా ట్యాంకుల శుభ్రతను పూర్తిగా వదిలేశారు.

ఏ ఊరికెళ్లినా ఇంతే ..!

గ్రామాలలో తాగునీటి ట్యాంకులు పాచిపట్టి కనిపిస్తున్నాయి. ట్యాంకులను ప్రతి 15 రోజులు కొకసారి శుభ్రం చేయాల్సి ఉన్నా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొరవడింది. కొంత మంది శుభ్రం చేసినట్లు చిత్రాలు తీసి అధికారులకి పంపి స్తున్నారు. మంచిలి, దంతిపల్లి తదితర గ్రామాల్లో ట్యాంకులు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాంకుల శుభ్రత చేసి సురక్షిత నీరందించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గేటు దాటాలంటే నరకమే..

బాదంపూడి క్రాసింగ్‌తో నిత్యం గంటలకొద్దీ నిరీక్షణ

ఉంగుటూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఉంగుటూరు మండలం బాదంపూడి రైల్వేగేటు వల్ల నిత్యం స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ గేటును దాటి వెల్లమిల్లి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. తాడేపల్లిగూడెంకు అత్యంత సమీపంలో ఉండడం, క్రాసింగ్ పాయింట్ కావడంతో గూడ్సు రైళ్ల వల్ల క్రాసింగ్‌కు నిలిపివేయడంతో ఇక్కడ గంటల కొద్దీ నిరీక్షణ తప్పడం లేదని వాపోతున్నారు. దీనిపై ఫిర్యాదులు చేద్దామన్నా కంప్లైంట్ పుస్తకం అందుబాటులో ఉండడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్‌కు సమస్యను విన్నవించామని పేర్కొన్నారు.


గేటు వేయడంతో నిరీక్షిస్తున్న వాహనదారులు


మధ్యలోనే నిలిచిపోయిన ఇండోర్‌స్టేడియం

వీటికి మోక్షమెపుడో ?

చింతలపూడిలో దీర్ఘకాలంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు

చింతలపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చింత లపూడి మండలంలో 20 సంవత్సరాలుగా బోయగూడెం-సీతానగరం రోడ్డు వేయాలని ప్రజల వేడుకుంటూనే ఉన్నారు. 2018లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎనిమిది కోట్ల రూపా యలు మంజూరు చేసి శంకుస్థాపన జరిపారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డును వేయ లేదు. నాబార్డు నిధులు రూ.20 కోట్లు మంజూరైనా ప్రారంభోత్సవం చేశారే గాని పనులు చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్మాణ పనులు చేపట్టింది. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయని నిర్మాణంలో నాణ్యత లేదని ఈ మార్గంలోని గ్రామాల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

నిలిచిన ఇండోర్ స్టేడియం

చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆట స్థలంలో 2018లో 2.2 కోట్ల వ్యయంతో క్రీడా సాధికారిక నిధులతో ఇండోర్ పనులు ప్రారంభించారు. గత వైసీపీ పాలనలో నిర్మాణం మూలనపడింది. ఇప్పటివరకు ఆ నిర్మాణ పనులు పూర్తి చేయలేదు. విద్యార్థులకు ఇది అలంకారప్రాయంగా ఉంది.

ఐదేళ్లుగా నిర్మాణంలో వంద పడకల ఆసుపత్రి

చింతలపూడి ప్రాంతీయ వంద పడకల ఆసుపత్రి ఐదేళ్లుగా నిర్మాణంలో ఉంది. 2013లో నిధులు మంజూరు కాగా శంకుస్థాపన చేసి వదిలేశారు. గత వైసీపీ పాలనలో రీ ఎస్టిమేట్‌తో నాబార్డు నిధులు రూ.25 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించారు. ఐదేళ్లుగా నిర్మాణం జరుగుతూనే ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ భవన నిర్మాణాలను పరిశీలించి ఎప్పటికి పూర్తవుతుందని అధికారులను ప్రశ్నించగా గతేడాది నవంబరు నాటికి పూర్తి చేస్తామని, మరోసారి ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని చెప్పారే తప్ప ఇంకా నిర్మాణాలు పూర్తికాలేదు.



ఐదేళ్లుగా నిర్మాణంలో వంద పడకల ఆసుపత్రి ..నత్త నడకన బోయగూడెం-సీతానగరం రోడ్డు



ఆరోగ్య ఉపవాసం

భక్తిశ్రద్ధలతో రంజాన్ ఉపవాస దీక్షలు

డ్రైఫ్రూట్స్, పండ్లకు ప్రాధాన్యం

ఆరోగ్యాన్నిచ్చే ఆహార నియమాలు

గణపవరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రంజాన్‌పండుగ నెలరోజులు ముస్లింలంతా ఉపవాసాలుంటారు. వంటింటిలో స్టవ్ వెలిగినట్లు కనపడదు. నెలరోజుల పాటు కఠినంగా ఉపవాస దీక్షలు చేస్తారు.పగలంతా దాహం కూడా దరికి రానివ్వరు. ఆకలికి చోటివ్వరు. ఆహారంలో ప్రత్యేకత చూపిస్తారు. ఈ పండుగ నెలరోజులు డ్రైఫూట్స్ ఫ్రూట్స్ తీసుకుంటారు. రంజాన్ ఉపవాసదీక్షలు, నమాజ్‌లు, ఆధ్యాత్మిక చింతనలతో పాటు ఆరోగ్యానందించి ముస్లింల జీవనాన్ని ఆనందమయం చేస్తాయి. సహరి, ఇఫ్తార్ సమయాల్లో తీసుకునే ఆహారం రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతే కాకుండా మంచి శక్తిని కూడా అందిస్తుంది. దీని ద్వారా ఉపవాస దీక్ష చేస్తున్న వారికి ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుంది. ఉపవాసం ఉండేవారు తెల్లవారుజామునే అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, పాలు, గోధుమ రుచులు, పెరుగు, మంచినీరు తీసుకుంటారు. ఈ ఆహారంలో డ్రైఫ్రూట్స్ కూడా భుజిస్తారు.

డ్రైఫ్రూట్స్ ప్రయోజనాలు

100 గ్రాముల జీడిపప్పు తింటే 596 కేలరీల శక్తినిస్తుంది.

అదే బాదంలో అయితే 250 కేలరీల శక్తి, 4.9 శాతం ప్రోటీన్‌లు ఉంటాయి, ఒక శాతం ఐరన్ లభిస్తుంది.

పిస్తాలో 557 కేలరీల శక్తి, 27 గ్రాముల కార్బోహైడ్రేట్స్, 20 గ్రాములు ప్రోటీన్‌లు లభిస్తాయి.

కిస్మిస్‌లో 299 కేలరీల శక్తి, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, పోషకాలు పుష్కలంగా లభిస్తాయి.

ద్రాక్ష పండ్ల ద్వారా 71 కేలరీల శక్తి లభిస్తుంది. 20 మిల్లి గ్రాముల కాల్షియం, 2.9 గ్రాముల పీచుపదార్థం. 1.5 మిల్లి గ్రాముల ఐరన్ లభిస్తుంది.



ఖర్జూరానికి ప్రాధాన్యం

ఖర్జూరం ముస్లింలు అధికంగా తీసుకుంటారు. 100 గ్రాముల ఖర్జూరంలో 234 కేలరీల శక్తి, 55.6 మిల్లిగ్రాముల కార్బోహైడ్రేట్లు, 1.8 మిల్లిగ్రాముల ప్రోటీన్లు, 76 మిల్లిగ్రాముల పీచుపదార్థాలు, 4 మిల్లి గ్రాముల సోడియం, 60.9 మిల్లి గ్రాముల పోటాషియం, ఐరెన్, విటమిన్-బి పుష్కలంగా ఉంటాయి. అందుకే ముస్లింలు ఎక్కువ శాతం ఖర్జూరానికే ప్రాధాన్యం ఇస్తారు. ధర కూడా కిలో రూ.120 నుంచి రూ.180 వరకు ఉంటుంది.



పాయసానికి సలాం కొట్టాల్సిందే..

రంజాన్ మాసంలో ముస్లింలు ఎక్కువగా చేసేది పాయసం. ఈ పాయసంలో ఆరోగ్యం ఉంది.ఈ పాయసంలో ఎక్కువగా డ్రైఫ్రూట్స్ వేస్తుంటారు. జీడిపప్పు, కిస్మిస్, యాలకులు, పిస్తా, బాదం, పంచదార తదితర రకాలు వేసి తయారు చేస్తారు. అందుకే ముస్లింలు చేసే పాయసానికి రంజాన్ మాసంలో చాలా ప్రత్యేకత. రంజాన్ రోజు అయితే ప్రతీ ముస్లిం ఇంటా పాయసం ఉండాల్సిందే. ఈ వంటకంలో హిందూ, ముస్లింల ఐక్యత కనపడుతుంది. పండుగ రోజు ముస్లింలు చుట్టుపక్కల అందరికి పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తున్నది. రంజాన్ రోజుల్లో పాల వినియోగం అధికంగా ఉంటుంది.


ఇంటిపై అమర్చిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్

గ్రామాల్లోను సోలార్ వెలుగులు

రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్‌లపై ఆసక్తి

లింగపాలెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో కూడా విద్యుత్ వాడకం గణనీయంగా పెరిగింది. వినియోగానికి తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడంతో తరచూ విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 90 శాతం రాయితీతో ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ల ఏర్పాటుకు ప్రోత్సాహిస్తున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన సోలార్ ప్లాంట్‌లు నేడు గ్రామాల్లో కూడా దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు వారి ఇళ్లకు విద్యుత్‌తో పాటు మిగిలిన విద్యుత్‌ను విద్యుత్ సంస్థలకు అమ్ముకునే అవకాశం ఉంది. దీని వల్ల వినియోగదారులకు ఆదాయం కూడా లభిస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. రాష్ట్రప్రభుత్వం పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్లలోపు విద్యుత్ ఉచితంగా అందిస్తున్నా కరెంటు బిల్లులు భారంగా మారడంతో పాటు సోలార్ ప్లాంట్‌లకు రాయితీలతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తుండటంతో వీటిపై ఆసక్తి కనబరుస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండటంతో సోలార్ ప్లాంట్ల వినియోగం శరవేగంగా విస్తరిస్తున్నది.

• బిల్లుల భారం తగ్గింది



మా ఇంటికి కరెంటు బిల్లు ఎక్కువగా వచ్చేది. వేసవి కాలంలో మూడువేల నుంచి నాలుగు వేల రూపాయలకు పైగా వస్తుండటంతో బిల్లు కట్టేందుకు ఇబ్బందులు పడవలసి వచ్చేది. ప్రభుత్వం, విద్యుత్‌శాఖ అధికారుల ప్రోత్సాహంతో మా ఇంటిపై 3 కిలో వాట్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకోవడంతో బిల్లుల భారం తగ్గింది. అవసరాలకు సరిపోగా మిగిలిన విద్యుత్‌ను అమ్ముతున్నా.

- బొల్లిన పుల్లారావు, ములగలంపాడు, లింగపాలెం మండలం



• గ్రామాల్లో సోలార్ ప్లాంట్లు వినియోగించుకోవాలి

రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్‌లు వినియోగించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. గృహాలకు, పంటపొలాల్లో వీటిని ఏర్పాటు కునేందుకు ప్రభుత్వం సబ్సిడీతో పాటు, బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తున్నది. మూడు కిలోవాట్ల సోలార్‌ప్లాంట్‌కు 2 లక్షల ఇరవై వేలరూపాయలు వరకు రుణాలు అందిస్తుండగా దానిలో లబ్ధిదారులకు 78 వేలు సబ్సిడీ అందిస్తున్నది. ఇప్పటికే రూఫ్‌టాప్ సోలార్‌ప్లాంట్‌ల కోసం 600 మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకోగా 15 మందికి అందించాం. మిగిలినవి కూడా వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

కూచిపూడి శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఏఈ, రంగాపురం, లింగపాలెం మండలం



తణుకులో సీఎం పర్యటన ఏర్పాట్లపై మాట్లాడుతున్న పశ్చిమ జిల్లా కలెక్టర్ నాగరాణి

రేపు తణుకులో సీఎం చంద్రబాబు పర్యటన

» ఏర్పాట్లను పరిశీలించిన పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ

తణుకు, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : తణుకులో ఈనెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన సందర్భంగా ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం తణుకు మున్సిపల్ కార్యాలయంలో సీఎం పర్యటన ఏర్పాట్లతో పాటు పట్టణంలో పర్యటించే పలు కార్యక్రమాల వివరాలను జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, జేసీ టి.రాహుల్‌కుమార్ రెడ్డితో పాటు పలు శాఖల అధికారులతో సమీక్షించారు. పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున హెలీప్యాడ్, ప్రజావేదిక, ఎన్టీఆర్ పార్కు వద్ద తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. తొలుత సీఎం సెక్యూరిటీ అధికారులతో కలిసి పాలిటెక్నిక్ కళాశాల హెలీపాడ్, ఎల్‌వన్, ఎల్‌టు గ్యాలరీ ఏర్పాటు, జడ్పీ హైస్కూల్లో ప్రజావేదిక, ఎన్టీఆర్ పార్కు తదితర ప్రాంతాలను పరిశీలించారు. జిల్లా అడిషినల్ ఎస్పీ భీమారావు, ఆర్డీవోలు కౌసర్ భానో, దాసిరాజు, ప్రవీణ్‌కుమార్, శివన్నారాయణ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రేపు తణుకులో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

ఇరగవరం/తణుకు : రాబోయే రోజుల్లో తణుకు పట్టణంలో ప్లాస్టిక్ క్యారీ బాగ్‌ల నిషేధంతో పాటు బయోడిగ్రేడబుల్ సంచులు వినియోగించే విధంగా ప్రోత్సహించనున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తెలిపారు. గురువారం తణుకులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి నెల మూడో శనివారం ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీలు, పరిశ్రమలలో పరిశుభ్రత, పారిశుధ్యానికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అందులో భాగంగా 15వ తేదీ తణుకు పట్టణంలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. శనివారం ఉదయం 8 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు తణుకు పట్టణం చేరుకుంటారని, బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ప్రజా వేదిక, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశం అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

హాస్టళ్ల నిర్వహణ, శుభ్రతపై దృష్టి సారించాలి

» జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరుసిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణ, శుభ్రత, భద్రతాపరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీప్రసాద్ కోరారు. గురువారం ఏలూరు జడ్పీ కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని మూడు జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సంక్షేమ పథకాల అమలుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హాస్టళ్లలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకో వాలని, పదో తరగతి పరీక్షల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిం చాలని, విద్యార్థులు ఏఏ సబ్జెక్టులలో వెనుకబడి ఉన్నారో తెలుసుకుని, ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సంబంధిత ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సీఈవో కె. భీమేశ్వర్, తూర్పుగోదావరి, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల సోషల్ వెల్ఫేర్ జేడీలు, బీసీ వెల్ఫేర్, ఎస్సీ, బీసీ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



పీజీపీఆర్ ఆసియా సొసైటీ ప్రతినిధులతో ఎంవోయూ అందుకున్న డాక్టర్ గోపాల్ తదితరులు

అన్యదేశ పంటలతో ఉద్యాన రైతులకు అధిక ఆదాయం

» పీజీపీఆర్ ఆసియా సొసైటీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విదేశాల్లోని పండ్లు, పూలను మన ప్రాంతంలో అభివృద్ధి చేయడం వల్ల రైతులకు అధిక ఆదాయంతో పాటు మన దేశంలో విదేశీ ఎగుమతులు తగ్గించుకోవచ్చని పీజీపీఆర్ ఆసియా సొసైటీ చైర్మన్ ఎంఎస్ రెడ్డి పేర్కొన్నారు. వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గురువారం ఆన్‌లైన్ విధానం ద్వారా అన్యదేశ ఉద్యాన పంటలు, హరిత భవిష్యత్ కోసం ప్రపంచ వాణిజ్యంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ కె.గోపాల్ మాట్లాడుతూ విదేశీ పండ్ల రకాలైన అవకాడో, డ్రాగన్ ఫ్రూట్, రాంభూటాన్, అబ్లు, ప్యాషన్ ఫ్రూట్ వంటి వాటితోపాటు పూలను, కూరగాయలను ముఖ్యంగా మన రాష్ట్రంలో సాగు చేయడం ద్వారా రైతులకు ఆదాయం పెరగడంతోపాటు విదేశీ మారక ద్రవ్యం నిలిచి ఉండేందుకు ఉపయోగపడుతుందన్నారు. అనంతరం వియత్నాం నుంచి ప్రొఫెసర్ నోగ్యన్ థాయ్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వియత్నాంకు చెందిన పీజీపీఆర్ ఆసియా సొసైటీతో ఉద్యాన విశ్వ విద్యాలయం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్‌పామ్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ కె.సురేష్, బెంగళూరు జాతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.ప్రకాశ్ పాటిల్, ఉద్యాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ డాక్టర్ ఎల్. నారంనాయుడు, శాస్త్రవేత్తలు మాట్లాడారు.



రూ.25 కోట్లతో నిర్మిస్తున్న నూతన స్టేషన్ భవనం

అత్యాధునికంగా నరసాపురం రైల్వే స్టేషన్

పశ్చిమ గోదావరి జిల్లాలోని నరసాపురం రైల్వేస్టేషన్ రూపురేఖలు మారిపోతున్నాయి. డబ్లింగ్ లైన్ పనులు పూర్తికావడంతో త్వరలో జిల్లాలోనే అతిపెద్ద స్టేషన్‌గా రూపకల్పన జరుగుతోంది. సంబంధిత పనులు చివరి దశకు చేరాయి. ఇప్పటికే రూ.10 కోట్లతో నిర్మించిన ఐవోహెచ్ షెడ్ అందుబాటులోకి వచ్చింది. మరో రూ.25 కోట్లతో అమృత్ భారత్ నిధులతో నిర్మిస్తున్న కొత్త భవనం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

నరసాపురం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి)

‘పశ్చిమ’ జిల్లాలో అతి పెద్ద జంక్షన్ స్టేషన్‌గా రూపకల్పన

» రూ.25 కోట్లతో కొత్త స్టేషన్ భవనం

» శరవేగంగా పుట్‌పాత్, లిఫ్ట్ పనులు

నరసాపురం రైల్వే స్టేషన్‌ను 1920లో నిర్మించారు. విజయవాడ, రాజమహేంద్రవరం మధ్య మీటర్ గేజ్ ఉండేది. 1960లో దీన్ని బ్రాడ్ గేజ్ చేశారు. 2023లో విజయవాడ-నరసాపురం మధ్య డబ్లింగ్ లైన్‌ను పూర్తి చేసి విద్యుత్‌లైన్ ఏర్పాటు చేశారు. ఆ పనుల్లో భాగంగా సింగిల్ ప్లాట్‌ఫారంగా ఉన్న స్టేషన్‌ను మూడు ప్లాట్‌ఫారాలుగా మార్చారు. కొత్తగా హుబ్లీ, బెంగళూరుకు వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు వేశారు. రోజుకు 32 రైళ్లు ఈ స్టేషన్‌లో రాకపోకలు సాగిస్తున్నాయి. వీటిలో ఐదు ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. నిత్యం రోజుకు ఈ స్టేషన్ నుంచి 12 వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు. త్వరలో కోటిపల్లి రైల్వేలైన్‌కు స్టేషన్‌ను అనుసంధానం చేస్తున్నారు. నరసాపురం స్టేషన్ జంక్షన్‌గా మారనుంది. భవిష్యత్ రద్దీని గుర్తించి జంక్షన్ తరహాలో అభివృద్ధి చేస్తున్నారు. ప్రయాణీకులకు అవసరమైన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్లాట్‌ఫారాలను కలుపుతూ ఒకటో నంబరు ప్లాట్‌ఫారం మీద పుట్‌పాత్ వంతెన లిఫ్ట్, ఎక్స్‌లేటర్‌ను నిర్మిస్తున్నారు. సుమారు రూ.కోట్లుతో చేపడుతున్న ఈ పనులు శరవేగంగా సాగుతోన్నాయి.

త్వరలో పాత భవనం తొలగింపు..

50 ఏళ్ల క్రితం నిర్మించిన స్టేషన్‌భవనం శిథిలావస్థకు చేరింది. దీని వెనుక భాగంలో రూ. 25 కోట్లతో నిర్మిస్తున్న కొత్త స్టేషన్ పనులు చివరి దశకు చేరాయి. త్వరలో ఆ భవనాన్ని ప్రారంభించి పాత భవనాన్ని తొలగించేందుకు రైల్వే సన్నాహాలు చేస్తుంది. స్టేషన్ ప్లాట్‌ఫారాలు ముందుకు జరపనున్నారు. రానున్న రోజుల్లో కోటిపల్లి రైల్వే లైన్ పనులు పూర్తయితే అదనంగా నాలుగో నంబరు ప్లాట్‌ఫారం నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు.

ఐవోహెచ్ షెడ్..

గతంలో రైళ్ల చక్రాలకు ఏమైనా ఇబ్బందులు వస్తే విజయవాడ పంపాల్సి వచ్చేది. ప్రస్తుతం చక్రాల మరమ్మతులకు సంబంధించిన ఐవోహెచ్ షెడ్‌ను స్టేషన్‌లో నిర్మించారు. బోగీ చక్రాలతో పాటు ఇతర మరమ్మతులను ఈ షెడ్‌లోనే చేపట్టనున్నారు. విజయవాడ డివిజన్‌లో ఒక్క నరసాపురం, కాకినాడలో మాత్రమే ఈ షెడ్‌లు ఉన్నాయి. స్టేషన్ ముందు భాగంలో సుమారు అర ఎకరం స్థలంలో వాహనాల పార్కింగ్‌తో పాటు గ్రీనరీని అభివృద్ధి చేస్తున్నారు. భవిష్యత్ రద్దీని గుర్తించి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.





ఐవోహెచ్ షెడ్‌లో బోగి చక్రాలు రిపేరు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

స్టేషన్ ప్రాంగణంలో పనులు

సమస్యలు పరిష్కరించి నిర్వాసితుల మన్ననలు పొందాలి



నిర్వాసితుల వద్ద సమస్యలు తెలుసుకుంటున్న ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

పోలవరం/బుట్టాయగూడెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌అండ్ ఆర్ సమస్యలను తెలుసుకుని పరిష్కరించి నిర్వాసితుల మన్ననలు పొందాలని ప్రాజెక్టు నూతన అడ్మినిస్ట్రేటర్ అభిషేక్ అన్నారు. గురువారం పోలవరం ప్రాజెక్టు కోండ్రుకోట పునరావాస కాలనీలో గురువారం ఆయన సందర్శించారు. పునరావాస కాలనీలో మౌలిక వసతులు తదితర అంశాలను స్వయంగా పరిశీలించారు. రైతు సేవా కేంద్రంలో పునరావాస కాలనీల సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అన్ని సమస్యలకు పరిష్కారం చూపారు. కొన్ని వివాదాస్పద సమస్యలపై చర్యలు తీసుకోవాలని కొవ్వూరు భూసేకరణ అధికారులకు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ అక్రమ ఆక్రమణలపై కొవ్వూరు డీఎస్పీతో మాట్లాడారు. నాలుగేళ్లుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించడంతో నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. 18 ఏళ్ల వారికి పరిహారం విషయంలో నిబంధనలకు లోబడి మృతి చెందిన వారి వారసత్వ ప్యాకేజీల విషయంలో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక పాఠశాలలో విద్యార్థులను జనరల్ నాలెడ్జి, ఇంగ్లీషు పరిజ్ఞానంపై ప్రశ్నించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆ తరువాత స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పెడుతున్న పౌష్టికాహారం విషయంపై ఆరా తీశారు. చిన్నారుల బరువు ఎత్తు విషయాలు స్వయంగా కొలతలు, తూకం వేయించి చూశారు. ఈ సందర్భంగా ఐటీడీఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనీల్‌కుమార్ శ్మశాన వాటికల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డీవో రమణ, తహసీల్దార్ సాయిరాజు, ఐటీడీఎస్ ప్రతినిధి ఫిలోమెన్, పూనెం విష్ణు, బుచ్చిబాబు, కోండ్రుకోట సర్పంచ్ పైదా నాగరాజు, నిర్వాసిత ప్రజలు పాల్గొన్నారు.

జూన్‌లోగా నిర్వాసితులను తరలించాలి

ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి అందజేసిన నిర్వాసితులను వారి కోసం నిర్మించిన కాలనీలకు జూన్‌లో వరదలు సంభవించడానికి ముందే తరలించాలని అధికారులను ఆయన ఆదేశించారు. గురువారం బుట్టాయగూడెం మండలం కేఆర్‌పురం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌ఆర్ అధికారులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపునకు గురైన 15 హేబిటేషన్‌లకు ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజిని ఈనెల 20 తేదీలోగా సమర్పించాలని ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్‌ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్‌ను ఆదేశించారు.

నేటి నుంచి పాలకొల్లు ఆసుపత్రిలో డయాలసిస్ సేవలు

పాలకొల్లు టౌన్, మార్చి 13 : పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం నుంచి కిడ్నీ రోగులకు డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కోటి రూపాయలతో ఏర్పాటు చేసిన యంత్రాలను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభిస్తారని మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రాంతంలో వైద్యసేవలు మెరుగుపరచాలని, డయాలసిస్ సెంటర్ అవసరాన్ని గుర్తించి మంత్రి నిమ్మల వంద పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేయడంతో పాటు డయాలసిస్ సెంటర్‌ను మంత్రి తీసుకురావడం పట్ల నియోజక వర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విష్ణు కాలేజీలో బాంబు బెదిరింపు మెయిల్‌పై దర్యాప్తు

భీమవరం క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : భీమవరం విష్ణు దంత కళాశాలలో ఈనెల 12న బాంబు బెదిరింపు మెయిల్ వచ్చిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ మెయిల్‌తో అప్రమత్తమైన పోలీసులు కాలేజీని జల్లెడపట్టారు. సుమారు ఆరు గంటలపాటు సోదాలు నిర్వహించి చివరకు బాంబు లేదని నిర్ధారించారు. ఎవరు మెయిల్ పంపించారనే కోణంలో సైబర్ క్రైం పోలీసుల దర్యాప్తు చేస్తున్నట్టు భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. తమిళనాడు వాసి పేరిట మెయిల్ ఉన్నట్టు గుర్తించడంతో ఇది అక్కడి నుంచి వచ్చిందా లేకపోతే వేరే వాళ్లు ఎవరైనా పంపించారా అనే కోణంలో విచారణ వేగవంతం చేశారు. పార్లమెంట్‌పై దాడి ఘటనలో సూత్రధారి అఫ్జల్‌గురుకు శిక్ష విధించినందుకు నిరసనగా విష్ణు దంత కళాశాలలో బాంబు పెట్టినట్లుగా మెయిల్ రావడంతో అప్రమత్తమైన పోలీసులు విచారణ చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తామని డీఎస్పీ తెలిపారు.

బెదిరించి బంగారపు ఆభరణాలు దోచేశారు

ఆచంట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : వల్లూరుకు చెందిన వడ్లమన్నాటి భాస్కరరావును కొంత మంది వ్యక్తులు బెదిరించి బంగారపు ఆభరణాలను దోచుకున్న ఘటన నెలకొంది. ఎస్ఐ వెంకట రమణ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన అతడు పక్షవాతంతో ఇంటి వద్దే ఉంటూ చిన్న పిల్లలకు చూపుడు తాళ్లు వంటివి ఇస్తుంటాడు. ఈ క్రమంలో ఈనెల రెండున కరుగోరుమిల్లికి చెందిన కొండేటి నాగరాజుతోపాటు మరో ఐదుగురు వ్యక్తులు అతడి ఇంటికి వచ్చి దౌర్జన్యం చేసి అతడి భార్య వెంకటలక్ష్మి వద్ద ఉన్న బంగారపు తాడు, ఉంగరం, చెవిదిద్దులు, వెండి పట్టీలుతో పాటు కొంత నగదు లాక్కుని వెళ్లిపోయారు. సుమారు రూ.8 లక్షల విలువైన బంగారు ఆభర ణాలు పట్టుకుపోయారన్నారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించారని గురువారం ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్రైమ్ కార్నర్

భార్యతో గొడవపడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవ పడిన భర్త ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరులోని పవర్‌పేట పిల్లా వారి వీధికి చెందిన దాసి సుశీల్(42) అతడి భార్యతో బుధవారం రాత్రి గొడవపడ్డాడు. అనంతరం యథావిధిగా ఇంట్లో అందరూ నిద్రించారు. తెల్లవారేసరికి గురువారం ఉదయానికి అతడు ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందడంతో సీఐ వైవీ రమణ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు ఢీకొని ఒకరి మృతి

ఏలూరు క్రైం : రైలు పట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని నూజివీడు రైల్వే స్టేషన్ దగ్గరలో రామిలేరు రైల్వే బ్రిడ్జి వద్ద నూజివీడు మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన బూరుగు కిషోర్ (40) గురువారం ఉదయం రైలుపట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ తన సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

పాము కాటుకు మహిళ మృతి



దేవమాత(ఫైల్)

పెదవేగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : పశువులను కాస్తున్న మహిళను పాము కాటు వేయడంతో ఓ మహిళ మృతిచెందింది. పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సొంగా దేవమాత (40) పశువులను మేపుతుంటుంది. బుధవారం పశువులను కాస్తుండగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పాము కాటు వేసింది. అపస్మారక స్థితికి చేరుకున్న ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో ఆమె మృతి చెందింది. ఆమెకు భర్త రాజేశ్వరరావు, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

» 40 మంది ప్రయాణికులకు త్రుటిలో తప్పిన ప్రమాదం



విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

కుక్కునూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చీరవల్లి, వింజరం గ్రామాల మధ్య పాలవాగు సమీపంలో గురువారం ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. కుక్కునూరు మీదుగా భద్రాచలం వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో దాదాపు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు స్తంభాన్ని ఢీకొట్టిన సమయంలో విద్యుత్ సరఫరా జరుగుతూనే ఉంది. ప్రయాణికులు ఈ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడి పలు వాహనాల మీదుగా భద్రాచలం చేరుకున్నారు.

నాలుగు నెలలుగా ప్రమాదాలు..

కుక్కునూరు, భద్రాచలం ప్రధాన రహదారి పనులు నిలిచిపోవడంతో నాలుగు నెలలుగా నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారంతా మెటల్‌తో ఉండడంతో వాహనాలు అదుపుతప్పుతున్నాయి.

రాజమహేంద్రవరం ఫ్లైఓవర్‌పై ప్రమాదం

» గొల్లవానిచెరువు వాసి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు



సాయి నరేష్ (ఫైల్)

రాజమహేంద్రవరం/పాలకొల్లు టౌన్,మార్చి 13 (ఆంధ్ర జ్యోతి): రాజమహేంద్ర వరంలోని మోరంపూడి ఫ్లైఓవర్‌పై బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్ర మాదంలో ఓ యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మరో యువకుడు మృత్యువుతో పోరా డుతున్నాడు. పాలకొల్లు మండలం గొల్లవాని చెరువుకు చెందిన కసుమర్తి సాయినరేశ్(30), గుంటూరు జిల్లా గోరంట్లకు చెందిన బోడపాటి రమేశ్ ద్విచక్ర వాహనంపై, వీళ్ల స్నేహితుడు మరొక ద్విచక్ర వాహనంపై రాత్రి 12.30 గం టల సమయంలో లాలాచెరువు వైపు నుంచి బొమ్మూరు వైపు వెళుతున్నారు. మోరంపూడి ఫ్లైఓవర్‌పై వెళుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టింది. బైక్‌పై వెళుతున్న నరేశ్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రమేశ్ అపస్మారక స్థితిలోకి వెళ్లగా నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. నరేశ్ మృతదేహాన్ని శవపరీక్ష అనంతరం బంధువులకు గురువారం అప్పగించారు. రాజమహేంద్రవరంలోని ఓ రైల్వే కాంట్రాక్టరు వద్ద మృతుడు సూపర్‌వైజర్‌గా, మరో యువకుడు సైట్ ఇంజనీరుగా పని చేస్తూ ఆల్‌కట్ గార్డెన్స్‌లో నివాసం ఉంటున్నారు. కారు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. బొమ్మూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లవానిచెరువులో విషాదచాయలు

రోడ్డు ప్రమాదంలో కసుకుర్తి సాయినరేష్ మృతి చెందడంతో గొల్లవానిచెరువు గ్రామంలో విషాదం అలుముకుంది. చేతికి అంది వచ్చిన కొడుకు చనిపోవడంతో వృద్ధాప్యంలో వున్న తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. అతడి మృతి పట్ల మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, టీడీపీ నాయకుడు పెన్మెత్స సాయిరాజు, పెన్మెత్స ఏసురాజు సంతాపాన్ని ప్రకటించారు.

నత్తారామేశ్వరంలో చోరీ / 50 కాసుల బంగారం 3 కిలోల వెండి అపహరణ



వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

పెనుమంట్ర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నత్తారామేశ్వరంలో భారీ చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి పుట్టింటికి వెళ్లిన కొవ్వూరి హేమసంధ్యారాణి బుధవారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఇంటిలోని బంగారం, వెండి వస్తువులు దొంగలు దోచుకుపోయారు. ఆ మహిళ బోరున విలపించడంతో స్థానికులు బంధువులు ఆమెతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లికి అనారోగ్యంగా ఉండడంతో గత శనివారం అమ్మగారి ఇంటికి అయినపర్రు వెళ్లిందని బుధవారం ఇంటికి వచ్చే సమయానికి ఇంటిలో దొంగలు పడి 50 కాసుల బంగారం, మూడు కిలోల వెండి సుమారు రూ.40 లక్షలు విలువైన సామగ్రి దోచుకుపోయారు. ఈ ఘటనపై పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్‌కుమార్, పెనుమంట్ర ఎస్ఐ టి.స్వామి, ఏఎస్ఐ వెంకటేశ్వరరావు క్లూస్ టీం, క్రైం బ్రాంచ్ అధికారులు ఘటన స్థలానికి వచ్చి చోరీకి గల కారణాలు, చుట్టుపక్కల సీసీ కెమెరాలు నుంచి సమాచారం సేకరించారు.

ఎక్స్‌కవేటర్లలో బ్యాటరీల అపహరణ

నత్తారామేశ్వరం, పెనుమంట్రగరువు, పొల మూరు ప్రాంతాల్లోని ఎక్స్‌కవేటర్లలోని బ్యాటరీ లను దొంగలు తస్కరించారని పెనుమంట్ర పోలీసులకు వాటి యాజమానులు ఫిర్యాదు చేశారు. గతంలో రొయ్యల చెరువుల వద్ద ఉన్న మేత బస్తాలను దొంగిలించారని పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

స్టీమర్ రోడ్డు చోరీని ఛేదించిన పోలీసులు

ఒకరి అరెస్ట్, మరొకరి పరారీ.. 5.25 కేజీల వెండి వస్తువుల స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ డాక్టర్ శ్రీవేద

నరసాపురం, మార్చి13 (ఆంధ్ర జ్యోతి) : పట్టణంలోని స్టీమర్‌రోడ్డులో పది రోజుల క్రితం జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. సిడగం కుమార్‌ను అరెస్టు చేసి 5.25 కేజీలు వెండి వస్తువులు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు ఉయ్యాల రాజేష్ పరారీలో ఉన్నట్టు డీఎస్పీ డాక్టర్ శ్రీవేద తెలిపారు. గురువారం రాత్రి టౌన్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ స్టీమర్‌రోడ్డులో నివాసం ఉంటున్న యర్రాప్రగడ వెంకటరత్నం గత నెలలో ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హైదరాబాద్ వెళ్లాడు. ఈనెల మూడో తేదీన ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించిన స్థానికులు ఈ విషయాన్ని అతడికి సమాచారం అందించారు. తక్షణమే పోలీసులకు ఆయన ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ శ్రీవేద, సీఐ యాదగిరి పరిశీలించి క్లూస్ టీమ్‌లను రప్పించారు. వాటి ఆధారంగా తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన సిడగం కుమార్, కోనసీమ జిల్లాకు చెందిన ఉయ్యాల రాజేష్‌పై నిఘా పెట్టారు. ఈక్రమంలో గురువారం సాయంత్రం కుమార్ పట్టణంలోని లాకుల వద్ద ఉన్నట్టు సమాచారంతో సీఐ యాదగిరి, ఎస్ఐలు ముత్యాలరావు, జయలక్ష్మి పట్టుకున్నారు. విచారించగా చోరీ చేసినట్టు ఒప్పుకున్నాడు. పరారీలో ఉన్న రాజేష్‌ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని, స్వాధీనం చేసుకున్న వస్తువుల విలువ సుమారు రూ. 5 లక్షలు ఉంటుందన్నారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నూజివీడుకు చెందిన రామశెట్టి ఉమామహేశ్వరరావు ఓ పత్రికలో విలేకరినంటూ చెప్పుకుంటూ పలువురిని మోసగిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో నూజివీడుకు చెందిన యువతి ఏలూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుతుండగా తరచు ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఆ యువతి త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం రాత్రి ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గోవుల తరలింపును అడ్డుకున్న స్థానికులు

కుక్కునూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వింజరం గోదావరి తీరం గోవుల అక్రమ రవాణాకు కేంద్రంగా మారింది. గురువారం ఉదయం వింజరం గోదావరి నది దాటి దాదాపు 48 గోవులను పాడేరు జిల్లా చింతూరు నుంచి ఇవతలకి తరలించారు. ఈ విషయం స్థానికులకు తెలియడంతో సచివాలయ సిబ్బందికి సమాచారం అందించారు. సచివాలయం వెంటర్నరి సిబ్బంది వచ్చి గోవులను తరలించిన వారి వద్ద ఎటువంటి అనుమతి పత్రం లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

దోసపాడులోని భూ సమస్యలపై చర్చ

దెందులూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : దోసపాడు గ్రామానికి చెందిన 106 ఎకరాలను పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో దోసపాడు గ్రామానికి సంబంధించిన భూముల వివాదంపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హేమలత, గ్రామ రెవెన్యూ అధికారితో కలిసి చర్చించారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ దోసపాడుకు చెందిన దళితులకు భూములను పంపిణీ చేసి న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నాగేంద్ర, ఆనందరావు, సామ్యూల్, లక్ష్మీ, మణి, మాణిక్యం, మరియమ్మ పాల్గొన్నారు.

నామవరాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి

చింతలపూడి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : నామవరం గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రజా ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీలత పిలుపునిచ్చారు. ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం గ్రామంలో కళాజాత నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం సారా వల్ల జరిగే అనర్థాలను వివరించారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ జిల్లా అధికారులు ఆవులయ్య, జి.పాండురంగా రావు, అజయ్ కుమార్ సింగ్, ఎంపీడీవో మురళీ కృష్ణ, ఎంపీపీ రాంబాబు, సర్పంచ్ వెంకటేశ్వరరావు, సత్యవతి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి : ఎంఈవో

లింగపాలెం, మార్చి13(ఆంధ్రజ్యోతి): టెన్త్ విద్యార్థులు పూర్తి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి ఉత్తమ మార్కులు సాధించాలని ఎంఈవో రామారావు పేర్కొన్నారు. 17వ తేదీ నుంచి జరగబోయే టెన్త్ పరీక్షల్లో ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రణాళికాబద్ధంగా రాయాలని సూచించారు. మండలంలో సింగగూడెం1, రంగాపురం 1, ధర్మాజీగూడెంలో 2 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆయా పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అన్ని శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పరస్పరం సహకరించుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు ఎంఈవో-2 జె.రవీంద్ర, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు జాబితా

బుట్టాయగూడెం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): పరిశీలన నిమిత్తం రైతు సేవా కేంద్రాల్లో పంటల నమోదు జాబితాను ప్రదర్శించినట్టు మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు తెలిపారు. గురువారం రెడ్డి గణపవరంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో ఇప్పటి వరకు 6 వేల మంది రైతులు వ్యవసాయ శాఖ ద్వారా విశిష్ట సంఖ్యను నమోదు చేసుకున్నారని, మిగిలిన రైతులు కూడా త్వరలో సంఖ్యను నమోదు చేయించుకోవాలని తెలిపారు.

అగ్రహారంలో ఘనంగా జగన్నాథస్వామి రథోత్సవం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : అగ్రహారంలోని జనార్దన స్వామి ఆలయంలో స్వామివారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం స్వామివారి రథోత్సవాన్ని నగర వీధుల్లో ఘనంగా నిర్వహించారు. వీధివీధిన భక్తులు స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చి మొక్కుబడులు చెల్లించుకున్నారు. తొలుత ఆలయం వద్ద రాజ్యలక్ష్మి తాయార్లకు 108 కలశ క్షీర తిరుమంజనాన్ని ఆలయ అర్చకులు వంగల పవన కుమారాచార్యులు, వెంకటాచార్యులు ఘనంగా నిర్వహించగా కార్యనిర్వాహణాధికారి నాగబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శుక్రవారం ఆలయం వద్ద రాజ్యలక్ష్మి తాయార్లకు లక్ష మల్లెల అర్చన, శనివారం పవళింపు సేవా కార్యక్రమాలతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఈవో తెలియజేశారు.

బోదవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

టి.నరసాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఫైలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ ఆర్.ఫణీంద్ర బాబు సూచించారు. జాతీయ ఫైలేరియా(బోదకాలు) నివారణా కార్యక్రమంలో భాగంగా టి.నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాలుగు సచివాలయాల్లో బాధితులకు మందులు, కిట్లు గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి సబ్ యూనిట్ అధికారి ప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్లు పి.మావుళ్లమ్మ, ఎండీపీ ఎస్ బేగ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

తివాచీ పరిశ్రమ సందర్శనకు విద్యార్థినులు

ఏలూరు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : సృజనాత్మక వ్యాపార అవకాశాలు - ప్రోత్సాహం అనే అంశంలో భాగంగా గురువారం ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థులను నగరంలోని తివాచీల తయారీ యూనిట్ల సందర్శనకు తీసుకెళ్లారు.కార్పెట్ తయారీపై విద్యార్థినులకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ తివాచీల పరిశ్రమకు అంతర్జాతీయంగా ఏలూరు పేరుగాంచిందని, వేలాది మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అమెరికా అధ్యక్షుని అధికారిక భవనం, భారత దేశ పార్లమెంటు భవనాల్లో ఏలూరు తివాచీలనే వినియోగిస్తారని అన్నారు.

ఉపాధి కూలీలందరికి పనులు కల్పించాలి : సీపీఎం

టి.నరసాపురం, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ కూలీలందరికీ పనులు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు.సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి అధ్యక్షతన స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం పార్టీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకటరావు మాట్లాడుతూ మండలంలో అపరిష్కృతంగా ఉన్న ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ 16న మండలంలో పాదయాత్రను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మడకం కుమారి, బరగడ కుమారి, అనుమోలు మురళీ పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ సభను జయప్రదం చేయండి

కొయ్యలగూడెం, మార్చి13 (ఆంధ్రజ్యోతి) : పిఠాపురంలో శుక్రవారం నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ మండలాధ్యక్షుడు తోట రవి, కొయ్యలగూడెం పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను కోరారు.ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసి సమావేశంలో మాట్లాడుతూ ప్రతీ గ్రామం నుంచి భారీగా జనసైనికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాల నుంచి బస్సు సదుపాయాలతో పాటు, భోజనాలు కూడా ఉన్నాయని తెలిపారు.

యశ్వంత్ మృతిపై విచారణ జరిపించాలి

ఏలూరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మోటార్ సైకిల్ దొంగిలించాడని నేరం వేసి బంగారు యశ్వంత్ అనే యువకుడి మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దళిత, ప్రజా సంఘాలు ఆందోళన చేపట్టాయి. ప్రజా సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన తెలిపి అనంతరం డీఆర్వోకు వినతిపత్రం అందచేశాయి. ఈ సందర్భంగా పలువురు సంఘ నాయకులు మాట్లాడుతూ యశ్వంత్ మృతికి పోలీసులే కారణమని, దీనిపై విచారణ జరిపించాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా నాయకులు మంచెల్ల ఇస్సాకు, రేవులగడ్డ మనీసుందర్ సింగ్, దళిత రైట్ ప్రొటెక్షన్ స్టేట్ ప్రసిడెంట్ కె.లెనిన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్ మధు, నవ్యాంధ్రప్రదేశ్ ఎమ్మార్పీఎస్ నాయకులు కె.వి.రత్నం, పౌరహక్కుల సంఘం జిల్లా నాయకులు కట్ట సత్యనారాయణ, అడ్వకేట్ జీవీఎల్ నరసింహరావు, సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షులు పి.బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ యువత జాబ్ మేళా 15కి వాయిదా

ఏలూరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్(ఎస్ఈఈడీఏపీ) స్కిల్ డెవలప్‌మెంట్, డిస్ట్రిక్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ద్వారా ఈ నెల 14న జరగాల్సిన జాబ్‌మేళాను శనివారానికి మార్చినట్టు జిల్లా మైనార్టీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకులు ఎస్.ఎస్.కృపావరం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని ముస్లిమ్, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ, జైన మతానికి చెందిన మైనార్టీ యువత జాబ్‌మేళాలో పాల్గొనాలని తెలిపారు. ఏలూరులోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో ఉదయం 10 గంటలకు, జంగారెడ్డిగూడెం పివిసి హెచ్ఆర్ అండ్ ఏఎంపీ కేబిటీఐ కళాశాలలో, నూజివీడు ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. సీడాప్ ఏపీ జీవోవీ డాట్ఇన్ వెబ్‌సైట్‌లో యూత్ వివరాలు నమోదు చేస్తే శిక్షణా కార్యక్రమాల వివరాలు ఉంటాయన్నారు. జాబ్‌మేళాలకు సంబంధించిన సమాచారం 08812-242463 నెంబర్‌లో సంప్రదించి తెలుసుకోవచ్చని అన్నారు.

నీటి తొట్టెలకు మరమ్మతులు

మూగజీవాలకు అందనున్న తాగునీరు

పెదవేగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పశువుల తాగునీటి తొట్లెలకు మోక్షం లభించింది. వేసవిలో పశువులకు తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో 2004 ఏడాదికి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి కోసం తొట్లెలను నిర్మించారు. గడిచిన ఐదారేళ్లుగా ఈ పశువుల తాగునీటి తొట్లెలు నిర్లక్ష్యానికి గురికావడంతో చాలా వరకు ధ్వంసమయ్యాయి. ఒక్క పెదవేగిలోనే అప్పట్లో ఆరు తొట్లెలను నిర్మించగా రెండు పూర్తిగా కనుమరుగయ్యాయి. మిగిలిన నాలుగు తొట్లెలకు ప్రస్తుత సర్పంచ్ తాతా శ్రీరామ్మూర్తి మరమ్మతులు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సురక్షితమైన నీటిని అందించే ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. పశువుల తాగునీటి అవసరాలను దృష్టిలో పెట్టుకుని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ ల్లోనూ 15వ ఆర్థిక సంఘం నిధులతో పశువుల తాగు నీటి తొట్లెలను ఏర్పాటు చేయిస్తున్నామని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. ప్రతి పంచాయతీ లోనూ పశువుల నీటి అవసరాలకు అనుగుణంగా నీటి తొట్లెలను ఏర్పాటు చేస్తామన్నారు.



నీటి తొట్టెకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్

ఘనంగా మొల్లమాంబ జయంతి



మొల్ల చిత్రపటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

ఏలూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కవయిత్రి మొల్లమాంబ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అన్నారు. వెనుకబడిన తర గతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టర్ బంగ్లా సమావేశ మందిరంలో మొల్ల జయంతిని గురువారం నిర్వహించారు. మొల్ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కలెక్టర్ మాట్లాడుతూ మొల్లమాంబ ప్రాధాన్యతను గుర్తించి జయంతిని అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రామాయణాన్ని అతి తక్కువ వ్యవధిలో సరళమైన బాషలో రూపొందించారని కలెక్టర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి ఆర్.వి. నాగరాణి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎన్.పుష్పలత పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం : తొలి తెలుగు మహిళా కవయిత్రి మొల్లమాంబను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని మాజీ కుమ్మరి ఫెడరేషన్ ఛైర్మన్ నాగేంద్ర కోరారు. కొయ్యలగూడెంలో మొల్ల జయంతిని నిర్వహించగా నాగేంద్ర పాల్గొని మాట్లాడుతూ మొల్ల ఎంతో మంది మహిళలకు ఆదర్శనీయమని, కుమ్మరి సామాజిక వర్గంలో పుట్టడం తమకెంతో గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శాలివా హన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీరవరపు నివాస్, మం డల కుమ్మరి సంఘం అధ్యక్షుడు తాతారావు, గొలిశెట్టి శ్రీను, పాలి శ్రీనివాస్, సూరిబాబు పాల్గొన్నారు.

● ఏలూరు రూరల్ : ఏలూరు వైసీపీ కార్యాలయంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవులు నగర బీసీ సెల్ అధ్యక్షులు కిలాడి దుర్గారావు అధ్యక్షతన మొల్ల జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్, నూకపెయ్యి సుధీర్, రాజేష్, నగర ఆర్టీఐ విభాగ అధ్యక్షులు ఫణి, తదితరులు పాల్గొన్నారు.

కోకో సాగుపై ఉద్యాన శాఖ సమీక్ష

ఏలూరుసిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కోకో సాగు చేసే రైతులు, కొనుగోలుదారులు, కంపెనీల ప్రతినిధులతో గురువారం జిల్లా ఉద్యాన శాఖాధికారి ఎస్.రామ్మోహన్ ముఖాముఖి నిర్వహించారు. ఏలూరులోని ఉద్యాన శాఖాధికారి కార్యాలయంలో రైతు సంఘం ప్రతినిధులతో కలిసి ఈ సమావేశం నిర్వహించారు. కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ పొడైన కోకో గింజల గ్రేడింగ్ చేసి కొనుగోలు చేస్తామన్నారు. గత సీజన్‌లోని గింజలను నిల్వ చేసి కొత్త గింజలతో కలపకూడదని అన్నారు. ఈ సీజన్‌లో వచ్చిన కోకో గింజలను రూ.600 చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు జిల్లా ఉద్యానశాఖాధికారి రామ్మోహన్ తెలిపారు. గత సీజన్ గింజలను కలపకుండా ఉన్న కోకో గింజలను కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

కైకరంలో అమ్మవార్లకు గ్రామోత్సవం

ఉంగుటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : కైకరం గ్రామంలో గురువారం పెద్దింట్లమ్మ, రుక్మిణీ సత్య భామ సమేత వేణు గోపాల స్వామి వార్లకు గ్రామో త్సవం ఘనంగా జరిగింది. గరగ నృత్యాలు మేళతాళాలతో బాణ సంచాలతో ఊరేగింపు జరిపారు. పెద్దింట్లమ్మ అమ్మవారి ఊరేగింపులో భాగంగా గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ఘర్షణలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తులు

ఘర్షణలో ఏడుగురికి గాయాలు

జంగారెడ్డిగూడెం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్వర్ణవారిగూడెం గ్రామానికి చెందిన తొమ్మిదేళ్ళ వెంకటరత్నం కుటుంబానికి అదే గ్రామానికి దనేకుల చెల్లారావు కుటుంబ సభ్యుల మధ్య బ్యారన్ విషయంలో వివాదం నడుస్తోంది. ఈ గొడవ గురువారం చిలికిచిలికి గాలివానగా మారడంతో ఇరు వర్గాలు కర్రలతో దాడి చేసుకున్నారు. ఈ దాడిలో గాయపడిన వారిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించగా పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

నిధులున్నా తీర్మానానికి అడ్డంకి..

తాగునీటి విషయంలో చర్యలు నిల్

పంచాయతీ పాలకవర్గంపై విమర్శలు

ఉంగుటూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కైకరం గ్రామంలో కొండయ్యపేట రక్షిత మంచి నీటి పథకం మరమ్మతుల కోసం మండల పరిషత్ నిధులు 15వ ఫైనాన్స్ నుంచి రూ.2.10 లక్షలు మంజూరు చేసినా పంచాయతీ పాలకవర్గం తీర్మానం చేయడంలో విఫలమైంది.గురువారం మండలంలోని కైకరం పంచాయతీ పాలకవర్గ సమావేశం జరిగింది. ఇందులో సర్పంచ్ సలగాల గోపి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలని జిల్లా యంత్రాంగం ఆదేశించినా కైకరం పాలకవర్గం మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. నిధుల మంజూరు విషయమై ఎంపీటీసీ చెన్ను సత్యవాణి మాట్లాడుతూ తాను ఆర్థిక సంఘం నుంచి నిధులు కేటాయించినా పాలకవర్గం తీర్మానం చేయకపోవడాన్ని ఖండించారు.కార్యదర్శి తీర్మానంపై చొరవ చూపక పోవడం పట్ల సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా గురువారం కొండయ్యపేట రక్షిత మంచినీటి పథకం మోటార్ పాడవడం గమనార్హం.



బహుమతులు అందజేస్తున్న శ్రీనివాసరావు

ప్రమాదాల నివారణపై అవగాహన

పెదవేగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు జాగ్రత్తలే ప్రధానమని ఫైప్‌లైన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఫిల్) ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. పెదవేగి మండలం కొప్పాకలోని ఫిల్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో కొప్పాక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వికసిత్ భారత్‌పై వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ మేరకు శ్రీనివాసరావు మాట్లాడుతూ భద్రతపై అవగాహన కల్పించడానికే ఈ పోటీలు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఫిల్ సంస్థ ప్రతినిధులు శైలజ, ఎస్.ఏ. ఖాన్, ఎల్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దుర్గమ్మ శతాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

బుట్టాయగూడెం, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : రెడ్డిగణపవరంలో కొలువైన కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శతాబ్ది ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సర్వం సిద్ధం చేసింది. ప్రతి ఏటా హోలి పౌర్ణమి రోజు నుంచి ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. శ్రీ కృష్ణదేవరాయల సామ్రాజ్యంలో రెడ్డిగణపవరం ప్రాంతంలో రెడ్డిరాజులు సామంత రాజులుగా ఉండేవారు.రెడ్డిరాజుల కాలంలో గణపతిరెడ్డి తమ విజయాలకు సూచికగా శ్రీ కనక దుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించి నిత్యం పూజలు చేసేవారు. ఈ ఆలయం పునఃనిర్మించి వందేళ్లు పూర్తికావస్తున్నందున శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమవుతున్నందున శుక్రవారం నుంచి మంగళవారం వరకు రెడ్డిగణపవరం వైపుగా భారీ వాహనాల రాకపోకలను నిలుపుదల చేసినట్లు ఎస్సై డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు.




రెడ్డిగణపవరంలో దుర్గమ్మ ఆలయం



క్రీడా దుస్తుల బహూకరణ

పెదవేగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : రామశింగవరం జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జె.రామకృష్ణ క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు బహుమతులు అందిస్తూ క్రీడల్లో ప్రోత్సహిస్తుంటారు. ఈ నేపథ్యంలో క్రీడల్లో ప్రతిభ చూపుతున్న 20మంది విద్యార్థులకు క్రీడాదుస్తులను అందించారు. పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచ్ అడపా శ్రీను చేతుల మీదుగా విద్యార్థులకు దుస్తులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ జి.మాధవ, హెచ్ఎం టి.వి.పద్మావతి, ఉపాధ్యాయులు ఎం.లక్ష్మీనారాయణ, వి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ సోనీ పాల్గొన్నారు.



పీడీ అందించిన క్రీడా దుస్తుల్లో విద్యార్థులు

సంపద సృష్టించాలి: డీఎల్‌పీవో

లింగపాలెం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలో ఉన్నచెత్త కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని చెత్త నుంచి సంపద సృష్టించాలని నూజివీడు డివిజన్ డీఎల్‌పీవో సుందరి అన్నారు. లింగపాలెం మండలంలో ధర్మాజీగూడెం, మఠంగూడెం, లింగపాలెం గ్రామాలలో చెత్త కేంద్రాలను గురువారం పరిశీలించారు. మండలంలో ఎన్ని చెత్తకేంద్రాలున్నాయి, వినియోగంలో ఉన్న వాటిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ప్రజలకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని తడి, పొడి చెత్తలను విడివిడిగా తెచ్చి చెత్తబండ్లలో వేసేలా తెలపాలన్నారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సుగుణరాజు, స్వరాజ్య లక్ష్మి సచివాలయ సిబ్బంది, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్న డీఎల్పీవో



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

విశిష్ట సంఖ్యను నమోదు చేసుకోవాలి

చింతలపూడి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : రైతులు విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ పాషా కోరారు.ప్రగడవరం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. రబీ సాగు చేసే రైతులు వరి పంట సాగులో సస్యరక్షణ చర్యలపై వివరించారు. అనంతరం హబీబ్ పాషా మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రైతులకు ఏ సబ్సిడీ పథకాలకైనా అర్హత అవసరమన్నారు. రైతు సేవా కేంద్రాల్లో మిగిలిన రైతులు త్వరగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భూసార పరీక్ష పత్రాలను రైతులకు అందజేశారు. ఆయన వెంట ఏడీఏ నాగకుమార్, ఏవో మీనాకుమారి, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో అకడమిక్ ఆడిట్

కామవరపుకోట, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం 2023-24, 2024-25 విద్యా సంవత్సరాలకు సంబంధించి అకడమిక్ ఆడిట్‌ను నిర్వహించారు. ఈ అకడమిక్ ఆడిట్‌కు అడ్వైజర్‌గా నియమించిన జంగారెడ్డిగూడెం సిఎస్‌పిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ జి.వెంకట్‌లాల్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.బోధన, నిర్మాణ పరంగా రెండు సంవత్సరాల్లో కళాశాల సాధించిన ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులకు విద్యపై ఆసక్తి పెంచాలని సూచనలు చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో నిప్పుల గుండం



అమ్మవారికి పవళింపు సేవ నిర్వహిస్తున్న దృశ్యం

కామవరపుకోట, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఆడమిల్లిలోని పార్వతీ సమేత కంఠ మహేశ్వరస్వామి, హరిహర పుత్ర అయ్యప్ప స్వామి, కనకదుర్గమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ముగింపును పురస్కరించుకుని పవళింపు సేవను ఆలయ ధర్మ కర్త తాతా సర్వేశ్వరరావు దంపతులు నిర్వహించారు. తొ లుత చండీ హోమం, లక్ష్మీదేవి హోమాలు నిర్వహించి కుంకుమ పూజలు జరిపారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు నిర్వహించారు. మహా ఆశీర్వచనం, చతుర్వేద స్వస్తి పలికారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో నిప్పుల గుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

నైపుణ్యాలు పెంచుకోవాలి

సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్ సూచన

ఏలూరుటూటౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : యువత నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని సెట్‌వెల్ సీఈవో కే.ప్రభాకర్ అన్నారు. లేడీస్ క్లబ్‌లో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఉపాధి, నైపుణ్యం అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంప్లాయ్‌మెంట్ అధికారి వి.వరలక్ష్మి మాట్లాడుతూ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసులో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీపీఆర్‌సీ డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. అటువంటి వారికే ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జే.రమాదేవి, ప్రవీణ్ కృష్ణ, ఝాన్సీ రాణి, సురేష్ పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

కార్యదర్శులకు భారం తగ్గించాలి

ఎంపీడీవోకు అసోసియేషన్ నాయకుల వినతి

చింతలపూడి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శులకు పనిభారం తగ్గించాలని కోరుతూ మండల కార్యదర్శుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఆర్. కుమార స్వామి మాట్లాడుతూ పంచాయతీల పరిధిలో ప్రస్తుతం 13 రకాల సర్వేలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సర్వేలతో పాటు ఇంటి, నీటి పన్నులు వసూలు చేయడంలో పని ఒత్తిడి పెరిగిందన్నారు. ఇదికాక ప్రభుత్వం ఇంకా 26 రకాల సర్వేలు చేయాలని ఒత్తిడి చేయడం వల్ల విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు శారీరకంగా, మానసికంగా అలసిపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సర్వేలను కూడా తగ్గించాలని కోరారు. ఈ మేరకు సభ్యులతో కలిసి వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందచేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వాణివసంతప్రసాద్, పలువురు కార్యదర్శులు పాల్గొన్నారు.

హామీలన్ని నెరవేరుస్తాం

ఏలూరుటూటౌన్, మార్చి13(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే కూటమి ధ్యేయమన్నారు. ఎమ్మెల్యే అయిన దగ్గర నుంచి గత 8 నెలలుగా ప్రజాసమస్యలు తెలుసుకుంటూ సాధ్యమైనంత వరకు వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్, త్రిపర్ణ రాజేష్, జుంజు మోజేష్ పాల్గొన్నారు.

రేపు మండల సమావేశం

పెదవేగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10గంటలకు ఎంపీపీ తాతా రమ్య అధ్యక్షతన జరుగుతుందని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. దెందులూరు శాసన సభ్యుడు చింతమనేని ప్రభాకర్ ఈ సమావేశంలో పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు వారివారి శాఖలకు సంబంధించిన నివేదికలతో సకాలంలో సమావేశానికి హాజరుకావాలని ఆయన తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : పెదవేగి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని కవ్వగుంట విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు చేస్తున్న కారణంగా శుక్రవారం మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఏలూరు ఈఈ కేఎం.అంబేడ్కర్ తెలిపారు. కావున కవ్వగుంట విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నేడు కైకరంలో సరఫరా నిలిపివేత..

ఉంగుటూరు,మార్చి 13(ఆంధ్రజ్యోతి):మండలంలోని కైకరంలో శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నామని గొల్లగూడెం విద్యుత్ శాఖ ఏ.ఈ. వేణు వివరించారు.విద్యుత్ వినియోగదారులు ఈ సహకరించాలని కోరారు.

తూతూ మంత్రంగా సమావేశం

బుట్టాయగూడెం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యలే లేనట్టు సర్వ సభ్య సమావేశాన్ని అధికారులు, ప్రజాప్రతిని ధులు తూతూ మంత్రంగా ముగించారు. గురువారం ఎంపీపీ కారం శాంతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు అధికారులు శాఖల వారీగా చెప్పిన లెక్కలపై విని మిన్నకుండిపోయారు. ఒకరిద్దరూ అసంపూర్తిగా ఉన్న మంచి నీటి ట్యాంకులపై ప్రశ్నించారే తప్ప సమస్యలపై ప్రస్తావనే లేదు. సమావేశంలో జడ్పీటీసీ మొడియం రామతులసీ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

షిర్డీ సాయికి అభిషేకాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :ఆదివారపుపేటలోని శ్రీ షిర్డీ సాయి ప్రేమమందిర్‌లో ఫాల్గుణమాసం గురువారం సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు బాబాకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. సాయి నామ సంకీర్తనలు, భజనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త ఇసుకపల్లి తాతారావు భక్తులకు అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. సాయంత్రం వేళల్లో జరిగిన పల్లకీ సేవా కార్యక్రమంలో సాయి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

ఏలూరు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు నైపుణ్యాలను అభివృద్ధి చేసి, మెరుగైన అవకాశాలను కల్పించేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ స్కిల్ హబ్ ద్వారా ఏలూరు సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో స్వల్పకాలిక శిక్షణనిచ్చిన అనంతరం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ పి.రజిత తెలిపారు. పదోతరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్న యువత శిక్షణ కోసం 89785 24022 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన ప్రథమ సంవత్సరం రసాయన, వాణిజ్య శాస్త్రం పరీక్షలకు జిల్లాలో మొత్తం 17,908 మంది విద్యార్థులు దరఖాస్తుచేసుకోగా 16,781మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 15,914మందికి 15,253 మంది, ఒకేషనల్ విభాగంలో 1994 మందికి 1528 మంది హాజరయ్యారని వివరించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొన్న కారు

జంగారెడ్డిగూడెం మార్చి 13(ఆంధ్రజ్యోతి): బుట్టాయగూడెం రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహం సమీపంలో గురు వారం ఓ కారు బీభత్సం సృష్టించింది. గోపాలపురం మండలానికి చెందిన ఓ వ్యక్తి ద్వారకాతిరుమల వెళ్లి తిరిగివస్తూ జంగారెడ్డిగూడెం బైపాస్‌లోకి కారును తిప్పు తుండగా అదుపు తప్పింది. దీంతో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఆ శాఖ అధికారులు విద్యుత్‌ను పురురుద్ధరించారు.



దెబ్బతిన్న కారు ముందు భాగం



హల్దీరామ్స్‌లో టెమాసెక్‌కు 10% వాటా

- రూ.8,500 కోట్లకు కొనుగోలు
- దేశీయ ప్యాక్డ్ ఫుడ్ రంగంలో ఇప్పటివరకిదే అతిపెద్ద డీల్

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద ప్యాక్ స్నాక్ అండ్ స్వీట్స్ కంపెనీ, రెస్టారెంట్ల ఆపరేటర్ హల్దీరామ్ స్నాక్స్ ఫుడ్‌లో 10 శాతం వాటాను సింగపూర్ ప్రభుత్వ పెట్టుబడి సంస్థ టెమాసెక్ కొనుగోలు చేసినట్లు ఇండస్ట్రీ వర్గాలు తెలిపాయి. ఇందుకు సంబంధించి ఇరువర్గాల మధ్య విధిగా కట్టుబడి ఉండే ఒప్పందం ఈ నెల 11న (మంగళవారం) కుదిరినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఈ ఒప్పందంలో భాగంగా హల్దీరామ్ స్నాక్ ఫుడ్ మార్కెట్ విలువను 1,000 కోట్ల డాలర్లు (దాదాపు రూ.85,000 కోట్లు)గా లెక్కగట్టినట్లు సమాచారం. అంటే, సంస్థలో 10 శాతం వాటా కోసం టెమాసెక్ 100 కోట్ల డాలర్లు (రూ.8,500 కోట్లు) చెల్లించనుంది. దేశీయ ప్యాక్డ్ ఫుడ్ ఇండస్ట్రీలో ఇప్పటివరకిదే అతిపెద్ద వాటా కొనుగోలు ఒప్పందం. అంతేకాదు, హల్దీరామ్ ప్రమోటర్లైన అగర్వాల్ కుటుంబం ప్రస్తుతం సంస్థలో 100 శాతం వాటా కలిగి ఉంది. అగర్వాల్ కుటుంబం వాటా విక్రయించడం ఇదే తొలిసారి. వ్యాపార విస్తరణకు నిధులు సమీకరించేందుకు సంస్థలో వాటా విక్రయించాలని అగర్వాల్ ఫ్యామిలీ గత కొన్ని నెలలుగా బ్లాక్‌స్టోన్, ఆల్ఫావేవ్, బెయిన్ క్యాపిటల్ సహా పలు ఇన్వెస్టర్లతో సంప్రదింపులు సాగించింది. గతంలో మెజారిటీ వాటా విక్రయం కోసం ప్రయత్నించినప్పటికీ మైనారిటీ వాటా ఉపసంహరణతో సరిపెట్టుకుంది.

మరో 5 శాతం వాటా విక్రయం!?

అగర్వాల్ కుటుంబం కంపెనీలో మరో 5 శాతం వాటాను విక్రయించే యోచనలో ఉన్నదని, ఇందుకోసం ఇతర ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ దిగ్గజం బ్లాక్‌స్టోన్‌తో పాటు టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ కూడా ఈ జాబితాలో ఉన్నాయి. అంతేకాదు, నిధుల సమీకరణ కోసం హల్దీరామ్ వచ్చే ఏడాది ఐపీఓకు సైతం వచ్చే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం.

1937లో ప్రారంభం: హల్దీరామ్స్ 1937లో రాజస్థాన్‌లోని బికనేర్‌లో కేవలం మిఠాయిలు, చిరుతిళ్ల విక్రయ కొట్టుగా ప్రారంభమైంది. గంగ బిషన్ అగర్వాల్ దీన్ని ప్రారంభించారు. ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి సంస్థగా అవతరించింది. హల్దీరామ్స్ ఉత్పత్తులను ప్రస్తుతం భారత్‌లోనే కాదు, 80కి పైగా దేశాల్లో విక్రయిస్తున్నారు. 2023-24లో కంపెనీ రూ.12,500 కోట్లకు పైగా ఆదాయం నమోదు చేసింది.

2028 నాటికి భారత్ @3

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే చాన్స్ ● మోర్గాన్ స్టాన్లీ

న్యూఢిల్లీ: భారత్ 2028 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని, అప్పటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 5.7 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.495 లక్షల కోట్లు) చేరుతుందని అంతర్జాతీయ ఆర్థిక సర్వీసుల సంస్థ మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. 2023లో 3.5 లక్షల కోట్ల డాలర్లున్న భారత ఆర్థిక వ్యవస్థ 2026 నాటికి 4.7 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని, ఫలితంగా అమెరికా, చైనా, జర్మనీ తర్వాతి స్థానంలో నాలుగో పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతుందని పేర్కొంది.

అత్యంత ఆకర్షణీయ వినియోగ మార్కెట్‌గా మారడం, ప్రపంచ ఉత్పాదకతలో తన వాటా పెంచుకోవడం, విధానపరమైన మద్దతుతో సాధించిన స్థూల ఆర్థిక స్థిరత్వం, మెరుగైన మౌలిక వసతులు ఇందుకు కారణమని తాజా నివేదికలో తెల్పి చెప్పింది. 1990లో 12వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ 2000 నాటికి 13వ స్థానానికి దిగజారింది. ఆ తర్వాత తిరిగి పుంజుకుని 2020 నాటికి 9వ స్థానానికి, 2023 నాటికి ఐదో స్థానానికి చేరింది. ప్రపంచ జీడీపీలో భారత్ వాటా ప్రస్తుతం 3.5 శాతం ఉండగా 2029 నాటికి 4.5 శాతానికి చేరుతుందని తెలిపింది.



మరో పావు శాతం రెపో కోత ఖాయం

భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) క్రమంగా ద్రవ్య విధానంపై పట్టు సడలిస్తోందని పేర్కొంటూ ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినందు వల్ల ఏప్రిల్ సమీక్షలో రెపో రేటును మరో 0.25% తగ్గించవచ్చని పేర్కొంది. ఫిబ్రవరి సమీక్షలో ఆర్‌బీఐ రెపోరేటును ఒక పావు శాతం తగ్గించిన సంగతి తెలిసిందే.

వృద్ధి గమనంలో మూడు ధోరణులు

భారత వృద్ధి గమనాన్ని మూడు ధోరణులుగా మోర్గాన్ స్టాన్లీ వర్గీకరించింది. ఒకటి బేర్, రెండోది బేస్, మూడోది బుల్ దశ. బేర్ దశలో అయితే ప్రస్తుతం 3.65 లక్షల కోట్ల డాలర్లున్న ఆర్థిక వ్యవస్థ 2035 నాటికి 6.6 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుంది. అదే బేస్ దశలో అయితే 8.8 లక్షల కోట్ల డాలర్లకు, బుల్ దశలో అయితే 10.3 లక్షల కోట్ల డాలర్లకు చేరవచ్చని జోస్యం చెప్పింది. 2025లో 2,514 డాలర్లున్న తలసరి జీడీపీ సైతం బేర్ దశలో 4,247 డాలర్లకు, బేస్ దశలో 5,683 డాలర్లకు, బుల్ దశలో 6,706 డాలర్లకు చేరవచ్చని అంచనా వేసింది.

ఈ ఏడాది వృద్ధి 6.3%

భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.3%, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 6.5% వృద్ధి సాధించవచ్చని అంచనా వేసింది. గత కొద్ది వారాల్లో ప్రధాన ఆర్థిక సూచీల కదలికలు మిశ్రమంగా ఉన్నప్పటికీ రెండు నెలల క్రితం పరిస్థితి కన్నా చాలా మెరుగ్గా ఉన్నట్టు పేర్కొంది. రాబోయే కాలంలో రికవరీ విస్తృత స్థాయిలో ఉంటుందని, బడ్జెట్లో ప్రకటించిన ఐటీ కోతలు పట్టణ డిమాండ్‌ను పెంచుతాయని పేర్కొంది. ప్రస్తుతం ప్రభుత్వ, గృహ రంగాల్లోని పెట్టుబడులు వృద్ధికి ఊతం ఇస్తున్నాయంటూ కార్పొరేట్ పెట్టుబడులు కూడా క్రమంగా పుంజుకుంటున్నట్టు తెలిపింది.

ట్రంప్ సుంకాలతో ఫార్మాలో అనిశ్చితి

అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సంతానం సుబ్రమణియన్

హైదరాబాద్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలతో భారత ఫార్మా కంపెనీలూ బెదిరిపోతున్నాయి. ఈ హెచ్చరికలతో ఫార్మా రంగంలో ప్రస్తుతం ఔనన్నా కాదన్నా అనిశ్చితి నెలకొందని అరబిందో ఫార్మా సీఎఫ్ఓ సంతానం సుబ్రమణియన్ 'ఈటీ నౌ' బిజినెస్ న్యూస్ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అయితే అమెరికాతో పాటు ఇతర దేశాల మార్కెట్లపైనా దృష్టి పెడుతున్నందున ఈ ప్రభావం తమ కంపెనీపై పెద్దగా ఉండకపోవచ్చన్నారు. తమ ఎగుమతుల్లోని టాప్ 10 ఔషధాల్లో అమెరికా వాటా 20 శాతానికి మించిలేదన్నారు. కాబట్టి ట్రంప్ సర్కార్ సుంకాలు పెంచినా ఆ ప్రభావం తమపై పెద్దగా ఉండక పోవచ్చన్నారు.

వృద్ధి ఒక్కటే లక్ష్యం కాదు: వృద్ధి ఒక్కటే తమ కంపెనీ లక్ష్యం కాదని సంతానం స్పష్టం చేశారు. వృద్ధితో పాటు సుస్థిర లాభాలు, టర్నోవర్‌పైనా ప్రత్యేక దృష్టి పెడుతున్నట్టు తెలిపారు. వ్యాపార విస్తరణ కోసం ఇంజెక్టబుల్స్, పెప్టైడ్స్, బయోసిమిలర్స్‌పైనా దృష్టి పెట్టినట్టు చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) రెండో త్రైమాసికంలోగా బయోసిమిలర్ ప్లాంటులో ఉత్పత్తి ప్రారంభమవుతుందని సంతానం చెప్పారు.

జెనరేటివ్ ఏఐతో బ్యాంకింగ్‌కు మేలే

న్యూఢిల్లీ: జెనరేటివ్ ఏఐ (జెన్ ఏఐ) భారత బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగాలను కూడా షేక్ చేస్తోంది. దీని వినియోగంతో 2030 నాటికి ఫైనాన్షియల్ రంగం ఉత్పాదకత 34 నుంచి 38 శాతం, బ్యాంకింగ్ రంగం ఉత్పాదక 46 శాతం మేర పెరగనుంది. ప్రముఖ అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ ఈవై గురువారం విడుదల చేసిన ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. ఖర్చులు తగ్గించుకుని, ఉత్పాదకత పెంచుకునేందుకు అనేక ఆర్థిక సేవల కంపెనీలు ప్రస్తుతం పెద్దఎత్తున జెన్ ఏఐ బాట పడుతున్నాయి. దీంతో ఆ కంపెనీల కస్టమర్ ఎంగేజ్‌మెంట్, నిర్వహణా సామర్థ్యం, నష్ట భయం (రిస్క్) మదింపు సామర్థ్యాలు గణనీయంగా పెరిగాయి. ఆర్థిక సేవలు, రిటైల్, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్, టెక్నాలజీ, ఆటోమోటివ్, పరిశ్రమలు, ఇంధన రంగాలకు చెందిన 125 మంది కీలక అధికారులను సంప్రదించి ఈవై ఈ నివేదిక రూపొందించింది.

రికార్డు గరిష్ఠానికి బంగారం

రూ.89,450కి పెరిగిన 10 గ్రాముల ధర

న్యూఢిల్లీ: దేశీయంగా పసిడి ధర గత రికార్డు గరిష్ఠ స్థాయికి ఎగబాకాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల బంగారం ధర రూ.600 పెరుగుదలతో రూ.89,450కి చేరుకుంది. గత నెల 20న మేలిమి బంగారం ఇదే ధర పలికింది. 99.5 శాతం స్వచ్ఛత లోహం విషయానికొస్తే, రూ.600 పెరిగి రూ.89,050కి ఎగబాకింది. ఇక కిలో వెండి మరో రూ.1,000 మేర ప్రియమై దాదాపు ఐదు నెలల నాటి గరిష్ఠ స్థాయి రూ.1,01,200కు చేరింది.

జానకి పులపర్తికి ఫోర్బ్స్ అండర్ 40 లీడర్స్ పురస్కారం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏఐ ఆధారిత డ్రోన్ ఇన్నోవేషన్‌లో అగ్రగామిగా ఉన్న అకిన్ అనలిటిక్స్ వ్యవస్థాపకురాలు, సీఈఓ జానకి పులపర్తి 2025 సంవత్సరానికి ఫోర్బ్స్ 40 అండర్ 40 లీడర్స్ పురస్కారానికి ఎంపికయ్యారు. టెక్నాలజీ పట్ల ఆసక్తి గల బాలిక స్థాయి నుంచి డీప్ టెక్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆమె ఎదిగిన తీరుకు ఈ పురస్కారం ఒక గుర్తింపుగా భావించవచ్చు. 2022లో అకిన్ టెక్నాలజీస్‌ను ప్రారంభించిన ఆమె.. సైనికులను క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేసే 125 గ్రాముల బరువుండే నానో రెకాన్ డ్రోన్‌ను అందించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ నమో డ్రోన్ దీదీ కార్యక్రమానికి ఉత్తేజితురాలై గ్రామీణ రైతులకు సహాయపడేందుకు ఏఐ ఆధారిత డ్రోన్ స్ప్రేయింగ్ వ్యవస్థను అందించారు.

సెన్సెక్స్ ఐదో రోజూ డౌన్

200 పాయింట్లు నష్టపోయిన సూచీ

ముంబై: స్టాక్ మార్కెట్లో నష్టాలు కొనసాగాయి. రియల్టీ, ఐటీ, ఆటో రంగ షేర్లలో అమ్మకాలు ఇందుకు కారణమయ్యాయి. గురువారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ మరో 200.85 పాయింట్లు కోల్పోయి 73,828.91 వద్దకు జారుకుంది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది ఐదో రోజు. నిఫ్టీ విషయానికొస్తే, 73.30 పాయింట్లు క్షీణించి 22,397.20 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 8 రాణించగా.. 22 నష్టపోయాయి. జొమాటో షేరు 1.97 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 1.95 శాతం వరకు తగ్గాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం అర శాతానికి పైగా పెరిగాయి.

ఎల్‌జీ రూ.15,000 కోట్ల ఐపీఓకు సెబీ ఆమోదం: దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజం ఎల్‌జీకి భారత అనుబంధ విభాగమైన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ప్రతిపాదనకు సెబీ ఆమోదం తెలిపింది. ఐపీఓ ద్వారా ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియాలో 15 శాతం వాటాకు సమానమైన 10.18 కోట్ల షేర్లను మాతృసంస్థ విక్రయించనుంది. తద్వారా రూ.15,000 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది.

యూపీఎస్ఐ పరిధి పెంపు సెబీ

క్యాపిటల్ మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ.. షేర్ల ధరలను ప్రభావితం చేయగలిగే అప్రకటిత సమాచారం (యూపీఎస్ఐ) పరిధిని మరింత విస్తరించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 11న విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం.. ఏదైనా ప్రతిపాదిత నిధుల సమీకరణ కార్యకలాపాలు, ఈఎస్‌జీ రేటింగ్ మినహా ఇతర క్రెడిట్ రేటింగ్ సవరణ, యాజమాన్యం లేదా కంపెనీ నియంత్రణను ప్రభావితం చేసే ఒప్పందాలు, కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియలో పరిష్కార ప్రణాళికకు ఆమోదం, వన్‌టైం బ్యాంక్ సెటిల్‌మెంట్, రుణాల పునర్‌వ్యవస్థీకరణ, బ్యాంక్‌లు లేదా ఆర్థిక సంస్థల నుంచి రుణాల సేకరణ సమాచారం కూడా యూపీఎస్ఐ పరిధిలోకి వస్తాయి. కాబట్టి, కంపెనీలు ఈ సమాచారాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెంటనే వెల్లడించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు జూన్ 10 నుంచి అమలులోకి వస్తాయని సెబీ స్పష్టం చేసింది.

నేడు మార్కెట్లకు సెలవు


హోలీ పండగ సందర్భంగా శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు. సోమవారం మార్కెట్లు యధావిధిగా పనిచేస్తాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



14వ తేదీ			
హైదరాబాద్	385	విజయవాడ	420
వరంగల్	387	గోదావరి	390
చిత్తూరు	443	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	78	విజయవాడ	85
వరంగల్	78	గుంటూరు	85
కరీంనగర్	78	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	78	చిత్తూరు	84
కర్నూలు	78	నెల్లూరు	89
విశాఖపట్నం	79	అనంతపురం	89
గోదావరి	85		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	88,580 ▲	81,200 ▲	1,10,000 ▲
విజయవాడ	89,500 ▲	84,500 ▲	1,01,000 ▲
విశాఖపట్నం	87,080 ▲	79,820 ▲	99,150 ▼
రాజమండ్రి	88,580 ▲	81,200 ▲	1,00,700 ▲
ప్రొద్దుటూరు	88,250 ▲	81,720 ▲	99,200 ▲
ముంబై	86,843 ▲	79,548 ▲	98,322 ▲

స్పోర్ట్స్

లక్ష్య సేన్ సంచలనం



అలవోకగా క్వార్టర్స్‌కు
- వైదొలిగిన సాత్విక్ జంట
- ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్

బర్మింగ్‌హామ్: డిఫెండింగ్ చాంపియన్ జొనాథన్ క్రిస్టీకి షాకిచ్చిన భారత ఏస్ షట్లర్ లక్ష్య సేన్.. ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ టోర్నీ క్వార్టర్స్‌కు దూసుకెళ్లగా.. డబుల్స్‌లో భారీ అంచనాలు పెట్టుకొన్న ఏడో సీడ్ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి జంట మ్యాచ్ మధ్యలోనే రిటైరైంది. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో లక్ష్యసేన్ 21-13, 21-10తో వరల్డ్ నెం:2 జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా)పై వరుస గేముల్లో సునాయాసంగా నెగ్గాడు. క్వార్టర్స్‌లో లి షి ఫెంగ్ (చైనా)తో సేన్ తలపడనున్నాడు. తొలి గేమ్ ఆరంభం నుంచే సేన్ ప్రత్యర్థిపై ఆధిపత్యం ప్రదర్శించాడు. 4-0తో ముందంజ వేసిన భారత షట్లర్ చివరి వరకు అదే జోరుతో గేమ్‌ను దక్కించుకొన్నాడు. ఇక, రెండో గేమ్ ఆరంభంలో నువ్వానేనా అన్నట్టుగా సాగినా.. ఒక్కసారిగా పుంజుకొన్న సేన్.. ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా పదునైన స్మాష్‌లతో మ్యాచ్‌ను ముగించాడు. ఇక మహిళల సింగిల్స్‌లో మాళవిక బన్సోడ్ 16-21, 13-21తో అకానె యమ గూచి (జపాన్) చేతిలో ఓడింది. డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో చైనా జంట జి హో నన్-జంగ్ వి హన్‌తో మ్యాచ్‌లో 16-21, 2-2తో వెనుకంజలో ఉన్న సమయంలో సాత్విక్-చిరాగ్ ద్వయం వైదొలిగింది. చిరాగ్‌కు వెన్నునొప్పి తిరగబెట్టడంతో మధ్యలోనే భారత జంట రిటైరైంది. తొలి రౌండ్‌లో డెన్మార్క్ జంట డేనియల్-మ్యాడ్స్‌పై సాత్విక్ జంట 21-17, 21-15తో గెలిచింది. మిక్స్‌డ్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని ద్వయం 10-21, 12-21తో చైనాకు చెందిన ఫెంగ్ యాన్ జి-వి య జిన్ చేతిలో పరాజయం పాలైంది.

'హార్దిక్ గొప్ప ఆల్‌రౌండరేమీ కాదు'



న్యూఢిల్లీ: ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా భారత జట్టు విజయాలలో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఇటీవలి చాంపియన్స్ ట్రోఫీలోనూ బ్యాట్, బంతితో సత్తా చాటాడు. పాకిస్థాన్ మాజీ స్పీడ్‌స్టర్ షోయబ్ అక్తర్..హార్దిక్ నైపుణ్యాలను మెచ్చుకొంటూనే.. అతడు మాల్కం మార్షల్, వకార్ యూనిస్ స్థాయి బౌలర్ కాదని అభిప్రాయపడ్డాడు. కాగా..హార్దిక్ కన్నా తమ ఆటగాడు అబ్దుల్ రజాక్ మెరుగైన ఆల్‌రౌండర్ అని మాజీ కెప్టెన్ మహ్మద్ హఫీజ్ అన్నాడు.

మతం మారనందుకే.. కెరీర్ నాశనం!

● పాక్ మాజీ క్రికెటర్ కనేరియా



న్యూయార్క్: పాకిస్థాన్ క్రికెట్ టీమ్‌లో తాను ఎదుర్కొన్న వివక్ష గురించి ఆదేశ మాజీ స్పిన్నర్ డానిష్ కనేరియా (44) సంచలన విషయాలు బయటపెట్టాడు. మతం మారనందుకే తన కెరీర్‌ను నాశనం చేశారని ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న కనేరియా వాపోయాడు. మైనారిటీగా పాక్‌లో ఎన్నో కష్టాలు, అవమానాలను ఎదుర్కొన్నానని చెప్పాడు. షాహిద్ అఫ్రీది కెప్టెన్‌గా ఉన్నప్పుడు తనను మతం మారమని తీవ్రంగా ఒత్తిడి చేసేవాడని తెలిపాడు. అయితే ఇంజమామ్ ఒక్కడే తనకు మద్దతుగా నిలిచాడన్నాడు. అఫ్రీది, షోయబ్ అక్తర్ ఎవరూ తనతో కలసి తినే వారు కూడా కాదన్నాడు. పాక్ తరఫున డానిష్ 61 టెస్టులు, 18 వన్డేలు ఆడాడు.

క్వార్టర్స్‌లో హైదరాబాద్

బీసీసీఐ మహిళల వన్డే ట్రోఫీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న బీసీసీఐ మహిళల అండర్-23 వన్డేట్రోఫీలో హైదరాబాద్ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం జరిగిన వన్డేలో హిమాచల్‌ప్రదేశ్‌పై హైదరాబాద్ 108 పరుగుల తేడాతో నెగ్గింది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 8 వికెట్లకు 205 రన్స్ చేసింది. కెప్టెన్ మమత అర్ధ శతకం (76)తో రాణించింది. ఛేదనలో స్పిన్నర్ శ్రుతి కేసరి (4/23) చెలరేగింది. హిమాచల్‌ప్రదేశ్ 32.4 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. ఈనెల 21వ తేదీన గువాహటిలో క్వార్టర్స్ జరగనుంది.

పారా అథ్లెట్ రవికి కాంస్యం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రీలో ఆంధ్రప్రదేశ్‌కు మూడో పతకం లభించింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ పోటీల్లో గురువారం ముగిసిన ఎఫ్ 40 విభాగం షాట్‌పుట్ పోటీల్లో అనకాపల్లి క్రీడాకారుడు ఆర్.రవి కాంస్యం సాధించాడు. డెనిస్ గ్నెజిడ్లోవ్ (రష్యా) స్వర్ణం, ఐయాల్ సివెట్సవ్ (అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ) రజతం నెగ్గారు.

నేటి నుంచి వైజాగ్ ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం



విశాఖపట్నం (ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్): సాగరతీరంలో ఐపీఎల్ సందడి మొదలైంది. ఈ ఐపీఎల్‌లో విశాఖపట్నం రెండు మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనుండడం తెలిసిందే. ఈనెల 24 రాత్రి 7.30 గంటలకు విశాఖలో జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ)-లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ మ్యాచ్ టిక్కెట్లను శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి జొమాటో డిస్ట్రిక్ట్ యాప్‌లో విక్రయించనున్నారు. ఈ సీజన్‌లో ఢిల్లీ తమ తొలి మ్యాచ్‌ను విశాఖలోనే ఆడనుంది. ఈనెల 30వ తేదీన ఢిల్లీ క్యాపిటల్స్‌-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగనున్న రెండో మ్యాచ్ టిక్కెట్లను ఎప్పటి నుంచి విక్రయించనున్నారో డీసీ నుంచి అధికారిక ప్రకటన రాలేదు.

భారత్.. ఒకేరోజు మూడు ఫార్మాట్లలో ఆడగలదు



సిడ్నీ: భారత క్రికెట్‌లో అద్భుత ఆటగాళ్లకు కొదవ లేదని ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ కొనియాడాడు. 'ఒకే రోజు ఆసీస్‌తో టెస్టును, ఇంగ్లండ్‌తో వన్డేను, దక్షిణాఫ్రికాతో టీ20 ఆడి పోటీనివ్వగల సత్తా భారత జట్టుకు ఉంది. ప్రపంచంలో మరే జట్టుకూ ఈ అవకాశంలేదు ఐపీఎల్ ద్వారా వారికి నైపుణ్యం కలిగిన క్రికెటర్లు లభిస్తున్నారు. అందుకే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ విజేతగా నిలవడం నాకేమీ ఆశ్చర్యం కలిగించలేదు. కానీ దుబాయ్‌లో వారికి లబ్ధి చేకూరిందని చెప్పలేం. ఎందుకంటే భారత్ మినహా ఇతర దేశాల ఆటగాళ్లు ప్రపంచంలోని అన్ని వేదికల్లో జరిగే లీగ్‌ల్లో ఆడతారు. కానీ భారత ప్లేయర్లు కేవలం ఐపీఎల్‌లో మాత్రమే కనిపిస్తారు' అని స్టార్క్ తేల్చాడు.

ఢిల్లీ.. కాచుకో

- ఫైనల్లో ముంబై ఇండియన్స్
- సివర్, మాథ్యూస్ హాఫ్ సెంచరీలు
- ఎలిమినేటర్‌లో గుజరాత్ చిత్తు
- మహిళల ప్రీమియర్ లీగ్


హేలీ మాథ్యూస్ (77 పరుగులు, 3 వికెట్లు)

నాట్ సివర్ (77)

ముంబై: అదిరే ఆటతో ముంబై ఇండియన్స్ మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్లో ప్రవేశించింది. గురువారం గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో విజృంభించిన హర్మన్ సేన 47 పరుగుల తేడాతో ఘనవిజయం అందుకుంది. దీంతో శనివారం జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 4 వికెట్లకు 213 పరుగుల భారీ స్కోరు సాధించింది. నాట్ సివర్ (41 బంతుల్లో 10 ఫోర్లు, 2 సిక్సర్లతో 77), హేలీ మాథ్యూస్ (50 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77), కెప్టెన్ హర్మన్ (12 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 36) తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. గిబ్సన్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 19.2 ఓవర్లలో 166 పరుగులకు కుప్పకూలింది. గిబ్సన్ (34), లిచ్‌ఫీల్డ్ (31), భారతి (30) మాత్రమే రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ మాథ్యూస్‌కు మూడు, అమెలియాకు రెండు వికెట్లు దక్కాయి.

నిలకడలేమితో..: భారీ ఛేదనలో గుజరాత్ పూర్తిగా తేలిపోయింది. ముంబై బౌలర్ల జోరుకు ఓపెనర్ బెత్ మూనీ (6), హర్లీన్ (8), కెప్టెన్ గార్డ్‌నర్ (8) తొలి ఆరు ఓవర్లలోనే పెవిలియన్‌కు చేరడం ప్రభావం చూపింది. అయితే మరో ఓపెనర్ గిబ్సన్‌తో పాటు మిడిలార్డర్‌లో భారతి ఫుల్మలి, లిచ్‌ఫీల్డ్ వేగంగా ఆడే ప్రయత్నం చేశారు. కానీ సరైన సమయంలో వీరిని పెవిలియన్‌కు చేర్చడంలో ముంబై సఫలమైంది. 15వ ఓవర్‌లో సిమ్రన్ 4,4,6.. తర్వాతి ఓవర్‌లో ఫుల్మలి 4,4తో గుజరాత్ 8 బంతుల్లోనే 27 పరుగులు సాధించి కాస్త ఉత్కంఠ పెంచింది. కానీ ఫుల్మలిని మాథ్యూస్ అవుట్ చేయడంతో ఇక జెయింట్స్ కోలుకోలేదు.

బాదుడే బాదుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ధనాధన్ బ్యాటింగ్‌తో చెలరేగింది. ఆరంభంలో ఓపెనర్ మాథ్యూస్-నాట్ సివర్ జోడీ.. చివర్లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ ఫినిషింగ్‌కు స్కోరు అవలీలగా 200 దాటేసింది. ప్రతీ బంతిని బాదడమే లక్ష్యంగా ఈత్రయం క్రీజులో కదం తొక్కడంతో జెయింట్స్ బౌలర్లు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. దీనికితోడు ప్రత్యర్థి ఫీల్డింగ్ వైఫల్యం కూడా ముంబైకి జత కలిసింది. ఓపెనర్ యాస్తిక (15) ఐదో ఓవర్‌లో వెనుదిరిగింది. ఇక ఐదు పరుగుల దగ్గర జీవదానం లభించిన మాథ్యూస్ 8వ ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో బ్యాట్‌కు పనిజెప్పింది. 36 బంతుల్లోనే తను ఫిఫ్టీ పూర్తి చేయగా, సివర్ రెండు వరుస సిక్సర్లతో 29 బంతుల్లోనే ఈ ఫీట్ అందుకుంది. అలాగే 57 పరుగుల వద్ద మాథ్యూస్ రెండో క్యాచ్‌ను కూడా వదిలేశారు. ఈ చాన్స్‌తో తను 16వ ఓవర్‌లో వరుసగా 6,6,4తో 19 రన్స్ రాబట్టింది. తర్వాతి ఓవర్‌లోనే మాథ్యూస్‌ను కశ్వీ అవుట్ చేయగా, అప్పటికే రెండో వికెట్‌కు 71 బంతుల్లోనే 133 పరుగుల భాగస్వామ్యం జత చేరడం విశేషం. మరో ఎండ్‌లో హర్మన్ వచ్చీ రాగానే విరుచుకుపడింది. తనూజ ఓవర్‌లో 6,4,4,6తో ఏకంగా 22 రన్స్ సాధించింది. సివర్ 19వ ఓవర్‌లో వెనుదిరగ్గా, ఆఖరి ఓవర్‌లో హర్మన్ మరో రెండు సిక్సర్లతో 15 రన్స్ అందించి రనౌటైంది.

ముంబై ఇండియన్స్: 20 ఓవర్లలో 213/4. (సివర్ 77, హేలీ మాథ్యూస్ 77, హర్మన్‌ప్రీత్ 36; గిబ్సన్ 2/40)
గుజరాత్ జెయింట్స్: 19.2 ఓవర్లలో 166 ఆలౌట్ (గిబ్సన్ 34, లిచ్‌ఫీల్డ్ 31, భారతి 30; మాథ్యూస్ 3/31, అమెలియా 2/28)

1

డబ్ల్యూపీఎల్ ప్లేఆఫ్స్‌లో అత్యధిక స్కోరు సాధించిన జట్టుగా ముంబై ఇండియన్స్. ఓవరాల్‌గా లీగ్‌లో ఇది మూడో అత్యధిక స్కోరు.

ఒకే సీజన్‌లో ఎక్కువ హాఫ్ సెంచరీలు (5) చేసిన ప్లేయర్‌గా సివర్

కొకైన్ కేసులో మెక్‌గిల్ దోషి



సిడ్నీ: నిషేధిత కొకైన్ సరఫరాలో పాల్గొన్నందుకు ఆస్ట్రేలియా మాజీ స్పిన్నర్ స్టువర్ట్ మెక్‌గిల్‌ను న్యూసౌత్‌వేల్స్ డిస్ట్రిక్ట్ కోర్టు దోషిగా తేల్చింది. 54 ఏళ్ల మెక్‌గిల్‌కు కొకైన్ సేవించే అలవాటు ఉంది. దాదాపు రూ.2 కోట్ల విలువైన కొకైన్ మార్పిడిలో మెక్‌గిల్ మధ్యవర్తిగా వ్యవహరించినట్టు ఆరోపణలున్నాయి. మరోవైపు వాటిని మాజీ స్పిన్నర్ ఖండించినప్పటికీ ప్రాసిక్యూషన్ తోసిపుచ్చింది. 2021నాటి ఈ కేసులో మెక్‌గిల్‌కు శిక్షను మేలో ఖరారు చేయనున్నారు.

540 కోట్ల మంది వీక్షించారు

జియో హాట్‌స్టార్ రికార్డు

న్యూఢిల్లీ: చాంపియన్స్ ట్రోఫీవీక్షణలో డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియో హాట్‌స్టార్ సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఓవరాల్‌గా టోర్నీని 540 కోట్ల మంది తిలకించినట్టు పేర్కొంది. అలాగే భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌ను ఏకంగా 124.2 కోట్ల మంది తిలకించారని జియోస్టార్ సీఈవో పేర్కొన్నారు.

బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం



న్యూఢిల్లీ: ఈ సీజన్ ఐపీఎల్ నుంచి చివరి నిమిషంలో వైదొలగిన ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్‌పై బీసీసీఐ కఠిన చర్యలు చేపట్టింది. అతడు రెండేళ్లపాటు ఐపీఎల్ ఆడకుండా నిషేధం విధించింది. ఈ మేరకు తన నిర్ణయాన్ని బీసీసీఐ గురువారం ప్రకటించింది. అంతేకాదు..బ్రూక్‌పై చర్యల విషయాన్ని ఆ క్రికెటర్‌తోపాటు, ఇంగ్లండ్, వేల్స్ క్రికెట్ బోర్డుకు కూడా తెలియజేసింది. గత ఏడాది నవంబరులో జరిగిన వేలంలో రూ. 6.25 కోట్ల ధరకు హ్యారీని ఢిల్లీ క్యాపిటల్ కొనుగోలు చేసిన విషయం విదితమే.



నాని నమ్మకం నిజమైంది

ప్రశాంతి తిపిర్నేని



'హిట్' సిరీస్ చిత్రాల నిర్మాత ప్రశాంతి తిపిర్నేని తాజా చిత్రం 'కోర్ట్'. వాల్ పోస్టర్ సినిమా పతాకంపై నాని సమర్పణలో ప్రియదర్శి కథానాయకుడిగా రామ్ జగదీశ్ తెరకెక్కించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా నిర్మాత ప్రశాంతి, సహ నిర్మాత దీప్తి మీడియాతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ "ఈ కథను దర్శకుడు రామ్‌జగదీశ్ చాలా బాగా రాశారు. చాలా లేయర్స్ ఉన్న ఈ సినిమా స్క్రీన్‌ప్లే అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. పెయిడ్ ప్రీమియర్స్‌కు అద్భుత స్పందన వస్తోంది. ముఖ్యంగా సెకండాఫ్‌ను ప్రేక్షకులు విపరీతంగా ఇష్టపడుతున్నారు. ప్రీమియర్స్‌కు వచ్చిన కొందరు లాయర్స్ సినిమా చాలా సహజంగా ఉందని మెచ్చుకున్నారు. సినిమాల విషయంలో నాని జడ్జిమెంట్ తప్పు కాదని కోర్ట్‌తో మరోసారి రుజువైంది. ఇందులో ప్రియదర్శి పాత్ర ఆయన కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుంది. మంగపతిగా నటించిన శివాజీ పాత్రనూ ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు. 'హిట్ 3' విడుదల తర్వాత కొత్త ప్రాజెక్ట్స్‌ను ప్రకటిస్తాం" అని అన్నారు. సహ నిర్మాత దీప్తి మాట్లాడుతూ "రామ్ జగదీశ్ మంచి ప్రతిభావంతుడు. ఈ కోర్ట్ రూమ్ డ్రామాను చాలా ఆసక్తికరంగా మలిచాడు. సినిమాలోని ప్రతీ పాత్ర గుర్తుండిపోతుంది. సినిమా కచ్చితంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుంది. భావోద్వేగాలు, కోర్ట్ సన్నివేశాలు, సంగీతం సినిమాకు ప్రధానాకర్షణ" అని చెప్పారు.

చాలా బాగుంది శ్రుతీ






కథానాయికగా దక్షిణాదిన సత్తా చాటిన శ్రుతీహాసన్ కొన్ని హిందీ చిత్రాల్లోనూ కనిపించారు. 'ద ఐ' చిత్రంతో ఆమె హాలీవుడ్ అరంగేట్రం చేయబోతున్నారు. ఇటీవలే చిత్ర బృందం శ్రుతి పాత్రను పరిచయం చేస్తూ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈ చిత్రం ట్రైలర్‌ను షేర్ చేసిన నయనతార 'చాలా బాగుంది శ్రుతీ' అంటూ ప్రశంసించారు. ట్రైలర్‌లో శ్రుతి నటన అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారు. 'ద ఐ'తో హాలీవుడ్‌లో శ్రుతికి శుభారంభం దక్కాలని ఆకాంక్షించారు. ఇప్పటికే పలు అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో 'ద ఐ' చిత్రాన్ని ప్రదర్శించారు. 'నా కెరీర్‌లో ఇదో డిఫరెంట్ మూవీ అవుతుంది' అని శ్రుతీహాసన్ పేర్కొన్నారు. డాఫ్నే ష్మోన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మార్క్‌రౌలీ కీలకపాత్ర పోషించారు. భర్త ఫెలిక్స్ కోసం అన్వేషిస్తూ సాగించే ప్రయాణం నేపథ్యంలో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో శ్రుతి డయానా అనే పాత్ర పోషించారు. ప్రస్తుతం రజనీకాంత్ 'కూలీ' చిత్రంలో ఆమె నటిస్తున్నారు.



జీవితంలోనూ ఛాంపియన్



నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ నటిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్'. ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామాకు ప్రదీప్ అద్వైతం దర్శకుడు. ఇప్పటికే విడుదలైన చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. రోషన్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేశారు. ఇందులో ఫుట్‌బాల్ ఆటగాడిగా రోషన్‌ను పరిచయం చేశారు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా, ధైర్యంగా నిలబడడం ఆకట్టుకుంది. మైదానంలోనే కాదు జీవితంలో కూడా నిజమైన ఛాంపియన్‌గా ఎదగడానికి చేసే పోరాటంగా ఈ చిత్రం ఉండబోతోంది. మిక్కీ జే మేయర్ అందించిన నేపథ్య సంగీతం హైలైట్‌గా నిలిచింది. తోట తరణి కళా దర్శకత్వం ఈ చిత్రం గొప్పతనాన్ని మరింత పెంచుతుంది. స్వాతంత్ర్యానికి పూర్వం జరిగిన కథతో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్ సంస్థలు నిర్మిస్తున్నాయి.

ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాం

కిరణ్ అబ్బవరం



కిరణ్ అబ్బవరం, రుక్సర్ థిల్లాన్ జంటగా నటించిన చిత్రం 'దిల్‌రూబా'. విశ్వకరుణ్ దర్శకత్వంలో రవి, జోజో జోస్, రాకేశ్‌రెడ్డి, సారెగమ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ప్రేమ, స్నేహంతో పాటు కుటుంబ విలువలు కలగలసిన అద్భుతమైన కథ ఇది. కథనం చాలా కొత్తగా ఉంటుంది. దర్శకుడు విశ్వ కరుణ్ సినిమాలో రాసిన డైలాగ్స్, సన్నివేశాలు ప్రేక్షకులతో విజిల్స్ వేయిస్తాయి. యూత్‌తో పాటు ఫ్యామిలీస్‌కు కనెక్ట్ అయ్యే చిత్రమిది. నటుడిగా నన్ను మరో మెట్టు ఎక్కించే ఈ చిత్రం నా కెరీర్‌లో ప్రత్యేకం. సినిమా తప్పకుండా అందరికీ మంచి వినోదాన్ని అందిస్తుంది. విజయంపై పూర్తి నమ్మకముంది" అని చెప్పారు. దర్శకుడు విశ్వకరుణ్ మాట్లాడుతూ "మనుషుల మధ్య తగ్గిపోయిన విలువలు, బంధాలను ఈ సినిమా తిరిగి గుర్తుచేస్తుంది. మంచి లవ్‌స్టోరీతో పాటు మాస్ ప్రేక్షకులను మెప్పించే ఫైట్స్ ఇందులో ఉన్నాయి. ఈ సినిమా ట్రైలర్ చూసిన దర్శకులు పూరి జగన్నాథ్, మెహర్ రమేశ్ ఫోన్ చేసి అభినందించారు. కిరణ్‌ను కొత్తగా చూపించే చిత్రమిది" అని అన్నారు. హీరోయిన్ క్యాథీ డేవిసన్ మాట్లాడుతూ "ఇందులో మ్యాగీ పాత్రను పోషించాను. ఇటువంటి మంచి రోల్ దక్కడం నా అదృష్టం. సినిమా చూసిన ప్రతీ ఒక్కరూ భావోద్వేగానికి లోనవుతారు" అని తెలిపారు.

శక్తిమంతమైన లుక్‌లో...



తమిళ కథానాయకుడు విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిస్తూ, నిర్మిస్తున్న తాజా చిత్రం 'భద్రకాళి'. ఆయనకు ఇది 25వ చిత్రం కావడం విశేషం. అరుణ్ ప్రభు దర్శకుడు. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విజయ్ ఆంటోని ఇందులో ఫ్యామిలీ మ్యాన్‌గా, గ్యాంగ్‌స్టర్‌గా, ఉన్నతాధికారిగా పలు శక్తిమంతమైన లుక్స్‌లో కనిపించారు. సంభాషణలు, విజువల్స్ ఆకట్టుకున్నాయి. త్వరలోనే సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సినిమా విజయ్ కెరీర్‌లోనే ప్రత్యేకంగా నిలిచిపోతుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి ఎడిటింగ్: రేమండ్ డెరిక్ క్రాస్టా, సినిమాటోగ్రఫీ: షెల్లీ కాలిస్ట్, సంగీతం: విజయ్ ఆంటోని.



ఆమెతో డేటింగ్‌లో ఉన్నా



ఆమిర్‌ఖాన్

తన స్నేహితురాలు గౌరీ స్ప్రాట్‌తో ఏడాదిన్నరగా డేటింగ్‌లో ఉన్నట్లు బాలీవుడ్ హీరో ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. ఆమెతో తనది పాతికేళ్ల పరిచయం అన్నారు. ప్రస్తుతం గౌరీ తన ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. నేడు ఆమిర్‌ఖాన్ 60వ పుట్టిన రోజు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన పుట్టిన రోజు వేడుకల్లో ఆయన గౌరీ స్ప్రాట్‌తో తన అనుబంధాన్ని మీడియాతో పంచుకున్నారు. గౌరీ స్ప్రాట్ ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్నారనీ, ఆమెకు గతంలో పెళ్లైందనీ, ఆరేళ్ల కుమారుడు కూడా ఉన్నాడని చెప్పారు. నాతో పాటు మా కుటుంబ సభ్యులు కూడా ఆమెతో అనుబంధం పట్ల సంతోషంగా ఉన్నట్లు తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా నా స్నేహితులు షారూఖ్‌ఖాన్, సల్మాన్‌ఖాన్‌కు ఇచ్చిన పార్టీకి కూడా గౌరి హాజరయినట్లు తెలిపారు. గతంలో రీనాదత్తా, కిరణ్‌రావును వివాహం చేసుకొన్న ఆమిర్ కొన్నాళ్ల తర్వాత విడాకులు తీసుకున్నారు.

కడుపుబ్బా నవ్వించే చిత్రం



కమెడియన్ సప్తగిరి కథానాయకుడిగా అభిలాశ్ రెడ్డి గోపిడి తెరకెక్కించిన వినోదాత్మక చిత్రం 'పెళ్లి కాని ప్రసాద్'. దిల్‌రాజు సమర్పణలో కె.వై.బాబు, భానుప్రకాష్ గౌడ్, సుక్కా వెంకటేశ్వర్ గౌడ్, వైభవ్‌రెడ్డి ముత్యాల నిర్మించారు. ఈ నెల 21న సినిమా విడుదలవుతుంది. తాజాగా, ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. "36 ఏళ్లు వచ్చినా పెళ్లికాని ఓ వ్యక్తి కథ ఇది. సినిమా కడుపుబ్బా నవ్విస్తుంది. సప్తగిరి మార్క్ వినోదం గ్యారంటీ" అని మేకర్స్ తెలిపారు. శ్రీనివాస్, మురళీధర్ గౌడ్, లక్ష్మణ్, రోహిణి, ప్రియాంక శర్మ తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ చిత్రానికి ఎడిటర్: మధు, డీఓపీ: సుజాత సిద్ధార్థ్, సంగీతం: శేఖర్ చంద్ర.





బైక్ ఢీకొని బాలుడికి తీవ్ర గాయాలు

ముదినేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పెయ్యేరులో బుధవారం గ్రామానికి చెందిన తోట రాజు కుమారుడు పీటర్ పాల్ (9) తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన ఒక యువకుడు బైక్‌పై వేగంగా వస్తూ బాలుడిని ఢీకొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన పాల్‌ను గురువారం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. గురువారం ఏఎస్ఐ పద్మజ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఢీ కొట్టిన యువకుడు పరారీలో ఉన్నాడు.



వైభవంగా వేణుగోపాలుడి గరుడోత్సవం

ముదినేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గురజలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం గరుడోత్సవం, రథోత్సవం జరిగాయి. ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో అర్చకుడు తేజోరామ్ స్వామివార్లకు పూజలు నిర్వహించారు.



సింగరాయపాలెం జనసేన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జయమంగళ

జనసేన ఆవిర్భావ సభకు తరలి రండి : ఎమ్మెల్సీ

ముదినేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం నియోజకవర్గం చిత్రాడలో ఈనెల 14న జరగనున్న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ కోరారు. సింగరాయపాలెంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మేరకు పిలుపునిచ్చారు. మండల పార్టీ కన్వీనర్ వీరంకి వెంకటేశ్వర రావు, పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు ఏఎన్.బాబు, వేల్పూరి నానాజీ, వడ్లాని ఆంజనేయులు, ఖాదర్ బాషా, జయమంగళ సాయి, వీరబ్రహ్మం, ఎంఎస్.రాజు పాల్గొన్నారు.



సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఎస్ఏ ఏపీసీ పంకజ్ కుమార్

సైన్స్ ల్యాబ్ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

సమగ్ర శిక్ష ఏపీసీ పంకజ్ కుమార్

ముదినేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పీఎంశ్రీ పథకం కింద ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలులో చేపట్టిన సైన్స్ ల్యాబ్ నిర్మాణాన్ని వచ్చే విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయాలని సమగ్ర శిక్షా జిల్లా అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పంకజ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన హైస్కూలులో ల్యాబ్ నిర్మాణ పనులను పరిశీలించారు. సుమారు రూ.15.85 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ సైన్స్ ల్యాబ్ నిర్మాణానికి 85 శాతం నిధులు కూడా విడుదలయ్యాయని తెలిపారు. రూ.22 లక్షల వ్యయంతో చేపట్టిన ప్రహరీ గోడ నిర్మాణంలో నాణ్యత ఉండాలని తెలిపారు. సమగ్ర శిక్ష ఏఎంవో రామారావు, హెచ్ఎం విజయ కుమార్ పాల్గొన్నారు. అనంతరం హైస్కూలు పూర్వ విద్యార్థి పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫీసర్ వడాలికి చెందిన కర్లప్రసాద్ అందజేసిన పరీక్షల మెటీరియల్‌ను విద్యార్థులకు ఏపీసీ అందజేశారు.

యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి) : యువతిని వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. నూజివీడుకు చెందిన రామశెట్టి ఉమామహేశ్వరరావు ఓ పత్రికలో విలే కరినంటూ చెప్పుకుంటూ పలువురిని మోసగిస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.ఈ నేపథ్యంలో నూజివీడుకు చెందిన యువతి ఏలూరులోని ప్రైవేటు కళాశాలలో చదువుతుండగా తరచు ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఆ యువతి త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గురువారం రాత్రి ఉమామహేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ ఏడాది పెదగొన్నూరులోనే రాయాలి..

టెన్త్ పరీక్ష కేంద్రం మార్పుపై డీఈవో స్పందన

ముదినేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చిగురుకోట జడ్పీ హైస్కూలు పదో తరగతి విద్యార్థులు ఈ ఏడాది టెన్త్ పబ్లిక్ పరీక్షలు పెదగొన్నూరు జిల్లా పరిషత్ హైస్కూలులో రాయాల్సి రావడంపై 'చిగురుకోట విద్యార్థులకు పరీక్ష' అనే శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు డీఈవో వెంకట లక్ష్మమ్మ స్పందించారు. ఆ కథనంలో గతేడాది కూడా విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ఇబ్బందులు పడారని, ఈ ఏడాదీ అవే కష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొవడం జరిగింది. డీఈవో స్పందిస్తూ ఇప్పటికే పరీక్షా కేంద్రం నిర్ణయమైనందున ఈ ఏడాది పెదగొన్నూరు పరీక్ష కేంద్రంలోనే రాయాల్సి ఉంటుందని, కేంద్రం మార్పు ఇప్పటికిప్పుడు సాధ్యం కాదన్నారు. వచ్చే ఏడాది పరీక్ష కేంద్రం మార్పుపై చర్యలు తీసుకుంటా మని తెలిపారు. చిగురుకోట నుంచి పెద గొన్నూరు వెళ్లేందుకు విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా వాహన సదుపాయం ఏర్పాటు చేసినట్లు హెచ్ఎం ఆర్.శ్రీధర్ తెలిపారు.

వైభవంగా పెద్దింటమ్మ తెప్పోత్సవం

ముగిసిన అమ్మవారి జాతర

కైకలూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కొల్లేటికోట పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాలు ముగిశాయి. గురువారం అమ్మవారి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి విశేష పూజలను నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని భుజబలపట్నం గ్రామానికి చెందిన పొత్తూరి సురేష్‌రాజు(వాసురాజు), శ్రీలత దంపతులు, ఐ.భీమవరం గ్రామానికి చెందిన గొట్టుముక్కల వెంకట సూర్యనారాయణరాజు, సుబ్బలక్ష్మీ దంపతులు అందజేశారు. హంస వాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈవో కూచిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు.



అమ్మవారికి హంసవాహనంపై తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లక్ష్మీనరసింహస్వామి చందనోత్సవం



కైకలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వరహాపట్నం భూ సమేత లక్ష్మీనరసింహ స్వామివారి 123వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం చందనోత్సవం, సింహవాహన సేవ, పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఈవో శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహిం చారు. మురళీ కోలాట బృందం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

అల్లూరులో నాగ నాంచారమ్మ జాతర

ముదినేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరులో నాగ నాంచారమ్మ జాతర మహోత్సవం హోలీ పౌర్ణమి సందర్భంగా గురువారం కోలాహలంగా జరిగింది. గ్రామస్థులు జాతరలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణతో పాటు పలువురు జన సేన నాయకులు, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు దావు నాగ రాజు తదితరులు పాల్గొన్నారు. అమ్మవారి పూనకాలతో అల్లూరు గ్రామం దద్దరిల్లింది. సుమారు 3 వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.



జాతరలో ఎమ్మెల్సీ జయమంగళ పూజలు

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు పూర్తి



ముదినేపల్లిలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులు

ముదినేపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడి యట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల లోని పరీక్ష కేంద్రంలో ప్రథమ సంవత్సరం కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలకు చివరి రోజున 171 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 162 మంది హాజరయ్యారు. 9 మంది గైర్హాజరైనట్టు పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారా యణమూర్తి తెలిపారు. ద్వారకాతిరుమల సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాల పీడీ ఆధ్వర్యంలో స్క్వాడ్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసింది.

రైలు నుంచి జారి గుర్తు తెలియని మహిళ మృతి



మండవల్లి మార్చి 13(ఆంధ్రజ్యోతి): రైలు నుండి జారిపడి గుర్తుతెలియని మహిళ మృతి చెందినట్టు గుడివాడ రైల్వే పోలీసుల తెలిపారు. మండవల్లి మండలం పసలపూడి- గుడివాడ మండలం మోటూరు రైల్వేస్టేషన్లకు మధ్యలో గురువారం ఉదయం ట్రాక్ పనులు చేస్తున్న కీమ్యాన్ గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని గుర్తించాడు. సమాచారం అందుకున్న గుడివాడ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా ట్రైన్ నుంచి పడి తలకి తీవ్రగాయమై మృతి చెందినట్లు తెలిపారు.ఆచూకీ ఎవరికైనా తెలియవస్తే గుడివాడ పోలీసుస్టేషన్లో సంప్రదించాలన్నారు.



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో అంబరీష్

15కల్లా భూ రీసర్వే పూర్తిచేయాలి : ఆర్డీవో

కలిదిండి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15కల్లా భూ రీసర్వే పూర్తి చేయాలని ఆర్డీవో అచ్యుత అంబరీష్ అధికారులను ఆదేశించారు.వెంకటాపురంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను గురువారం పరిశీలించారు. 1100 ఎకరాలకు 800 ఎకరాల భూమిని నిర్ధారించారని, మిగిలిన 300 ఎకరాల భూమిని మూడు రోజుల్లో పూర్తి చేస్తారన్నారు. తహసీల్దార్ రామకృష్ణ, ఆర్ఐ శ్యామల, మండల సర్వేయర్ షమీ, వీఆర్వో కమల హాసన్, సిబ్బంది పాల్గొన్నారు.



స్వామికి నిర్వహించిన అన్నాభిషేకం

పాతాళ భోగేశ్వరస్వామి 16 రోజుల పండుగ

కలిదిండి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కలిదిండి పార్వతీ సమేత పాతాళ భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం ఆలయం వద్ద 16 రోజుల పండుగ వైభవంగా నిర్వహించారు. స్వామికి విశేష పూజలు, అన్నాభిషేకం చేశారు. అన్నసమారాధన నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, మాజీ జడ్పీటీసీ రమాదేవి, సర్పంచ్ మారుతి ప్రసన్న, ఆలయ ఈవో శేఖర్ పాల్గొన్నారు.

టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ బాక్స్ తొలగింపు

కలిదిండి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కలిదిండి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద 34 ఏళ్లుగా ఉంటున్న టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ బాక్స్‌ను బీఎస్ఎన్ఎల్ అధికారులు గురువారం తొలగించారు. దళిత నాయకులు పలుమార్లు బాక్స్‌ను తొలగించాలని విన్నవించినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో తొలగించినట్టు టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఏడుకొండలు తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయండి

చాట్రాయి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చాట్రాయిలో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ మేరకు వ్యవసాయ, మార్క్‌ఫెడ్ అధికారులకు రైతులు వినతి పత్రాలు అందజేశారు. మండలంలో ఈ రబీ సీజన్‌లో కమర్షియల్ మొక్కజొన్న ఆరు వేల ఎకరాల్లో, సీడ్ మొక్కజొన్న రెండు వేల ఎకరాల్లో మొత్తం 8,200 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరిగింది. ఇప్పటికే ముందుగా వేసిన మొక్కజొన్న కండెలు విరిసి కల్లాలపై ఆరబోస్తున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న క్వింటా రూ.2250కి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. పంట ఎక్కువగా మార్కెట్‌లోకి వస్తే వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తే వ్యాపారులు ధరలు తగ్గించే అవకాశం ఉండదని రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రం లేకపోతే నష్టం



ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోళ్లు జరపకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతుంది. కేంద్ర ఏర్పాటు చేయకపోతే వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటారు.
- శీర్లం వేణుగోపాలరెడ్డి, రైతు, చాట్రాయి

ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించాం

రైతుల విజ్ఞప్తి మేరకు చాట్రాయిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాము. దీనిపై ప్రభుత్వం జీవో విడుదల చేయవలశి ఉంది. ఈ రబీ సీజన్‌లో మండలంలో కమర్షియల్ మొక్కజొన్న 6 వేల ఎకరాల్లో, సీడ్ మొక్కజొన్న 2 వేల ఎకరాల్లో మొత్తం 8200 ఎకరాల్లో సాగు అయ్యింది.
- శివశంకర్, ఏవో, చాట్రాయి మండలం



సాగర్ నీటిని పరిశీలిస్తున్న డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌ల బృందం

సాగర్ మూడో జోన్‌కు 1500 క్యూసెక్కులు విడుదల చేయాలి

నీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ

నూజివీడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సాగర్ ఎడమ కాలువ మూడో జోన్‌లో తీవ్రమైన తాగు, సాగునీటి ఎద్దడి నెలకొన్న ఈ పరిస్థితుల్లో ఆయకట్టు పరిధిలోని నూజివీడు, తిరువూరు, మైలవరం, నందిగామ, గన్నవరం నియోజకవర్గాల శాసనసభ్యులు మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ అంశం అసెంబ్లీలో ప్రస్తావించడంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వానికి సాగర్‌నీరు 1500 క్యూసెక్కులు విడుదల చేయాలని కోరారని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణ తెలిపారు. గురువారం మూడు జిల్లాలకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌లతో కలిసి క్షేత్రస్థాయి పర్యటన ఆయన జరిపారు. ఆంధ్ర ప్రదేశ్ బోర్డర్ రెగ్యులేటర్ ఉన్న 101వ కిలో మీటర్ వద్ద ఈ బృందం నీటి సరఫరాను పరిశీలించింది. అనంతరం గురువారం రాత్రి నూజివీడులో విలేకరులతో ఆయన మాట్లాడారు. తాము క్షేత్రస్థాయి పరిశీలన జరిపిన సమయంలో 234 క్యూసెక్కుల నీటిని తెలంగాణ ప్రభుత్వం కిందకు విడుదల చేయడం గమనించామన్నారు. సాగర్ ఎడమ కాలువకు 32 టీఎంసీల వాటా ఉన్నప్పటికీ కృష్ణా నది యాజమాన్య బోర్డు నీటి ఉత్తర్వులు ఇచ్చిన ప్పటికి ఈ రోజు వరకు 18 టీఎంసీల నీరు మాత్రమే తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఆనవాయితీ ప్రకారం పాలేరు రిజర్వాయర్ హెడ్‌ను 20 అడుగులకు పెంచి ఆంధ్రప్రదేశ్‌కు మిగిలివున్న 13 టీఎంసీల కోటా నుంచి ఈ 2వేల క్యూసెక్కులను విడుదల చేయడానికి అన్నిరకాల చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, నాగార్జున ప్రాజెక్ట్ ఉన్నతాధికారులకు ఈ బృందం విజ్ఞప్తి చేసింది. డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు రవిశంకర్, కటారి కోటేశ్వర రావు, కొల్లి శ్రీనివాసరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ, దేవినేని సత్యనారాయణతో పాటు రైతు నాయకులు, పాల్గొన్నారు.

ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం

ఆగిరిపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):ప్రపంచ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేయుచున్న బి.ప్రసాద్‌ను వైద్యాధికారి డాక్టర్ జగన్‌మోహన్‌రావు సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రావు మాట్లాడుతూ గత ఏడాది ఏలూరు జిల్లా కలెక్టర్‌చే ఉత్తమ ల్యాబ్ టెక్నీషియన్‌గా సత్కారం పొందారని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో గల గ్రామాల్లోని ప్రజలందరికి వైద్య పరీక్షలు చేస్తూ సేవలందిస్తున్నారని, వీరి సేవలను వెలకట్ట లేనివని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖలో పొదుపు చేస్తే అధిక వడ్డీ

చాట్రాయి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖలో పలు పథకాలలో పొదుపు చేసుకుంటే భద్రతతో పాటు అధిక వడ్డీ పొందవచ్చని పోస్టల్ ఎస్పీ ముత్యాల శ్రీనివాస్ అన్నారు. జనార్ధనవరంలో బ్రాంచి పోస్టాఫీస్‌ను గురువారం ఆయన తనిఖీ చేసి విలేకరులతో మాట్లాడారు. సుకన్య సమృద్ధి యోజన ఆడపిల్లల బంగారు భవితకు కొండంత భరోసా ఇస్తుందని, పదేళ్ల లోపు వయస్సు బాలికలకు తల్లిదండ్రులు చట్టబద్ధ సంరక్షకులు ఈ ఖాతా తెరవవచ్చన్నారు. ఖాతా కాల పరిమితి 21 ఏళ్లను, ఖాతా తెరిచిన 15 సంవత్సరాల వరకే పొదుపు చెల్లించాలన్నారు. ఇంకా పలు పథకాలను వివరించారు. బ్రాంచి పోస్టుమాస్టర్ డీవీ అప్పారావు పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఇద్దరు జూదరుల అరెస్ట్

రూ.60,400 నగదు, 27 బైక్‌ల స్వాధీనం

చాట్రాయి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నరసింహరావుపాలెం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ. 60,400 నగదు, 27 బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గ్రామాల్లో జూదక్రీడలపై సమాచారం అందించాలని సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ అన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 97, 107
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

నూజివీడు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : సమస్య పరిష్కారానికి మధ్యవర్తిగా వెళ్లిన న్యాయవాదిపై దాడి చేసి కేసు నమోదు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో ఓ భూ వ్యవహారంలో మధ్యవర్తిగా నూజివీడుకు చెందిన న్యాయవాది కొలుసు సీతారామ్ వెళ్లారు. ఈ క్రమంలో ఆయనపై పలువురు దాడిచేశారు. నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాది ఫిర్యాదు చేయగా, కేసు కట్టకుపోగా న్యాయవాదిపైనే వీరవల్లి పోలీసులు కేసు నమోదు చేయడంతో పోలీస్‌శాఖ తీరును నిరసిస్తూ నూజివీడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ న్యాయవాది సీతారామ్‌కు సంఘీభావంగా గుంటూరు, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని బార్ అసోసియేషన్‌ల న్యాయవాదులు విధులను బహిష్కరించినట్టు తెలిపారు.



కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఏరియా ఆసుపత్రిలో సిబ్బంది ర్యాలీ

ప్రతి ఒక్కరూ కిడ్నీ ఆరోగ్యంపై దృష్టి సారించాలి

నూజివీడు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ కిడ్నీ ఆరోగ్యంపై దృష్టిసారించి ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర సింగ్ అన్నారు. నూజివీడు ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ తదనంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీపీ, షుగర్, కిడ్నీ రుగ్మతలకు దారితీస్తాయన్నారు. కార్యక్రమంలో అపోలో కిడ్నీసెంటర్ ఆపరేటింగ్ మేనేజరు వి.మధుకిరణ్, వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి తోటల్లో తామర పురుగుల ఉధృతి

నూజివీడు టౌన్/చాట్రాయి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో తామర పురుగులు, తేనెమంచు ఉధృతి అధికంగా ఉందని, వాటి నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని నూజివీడు మండల ఉద్యానవనశాఖ అధికారిణి, చాట్రాయి మండల ఇన్‌చార్జి అధికారిణి ఆర్.హేమ అన్నారు. గురువారం నూజివీడు మండలం అన్నవరం, చాట్రాయి మండలం చాట్రాయి, చిత్తపూరు, చనుబండ, నరసింహారావుపాలెం, కోటపాడు, చీపురుగూడెం గ్రామాల్లో రైతుసేవా కేంద్రాల సిబ్బందితో కలిసి ఆమె మామిడి తోటల పరిశీలన చేశారు. తేనెమంచు నివారణకు వేపనూనె 1500 పీపీఎం, ఇమిడాక్లోపిడ్ 0.3 ఎంఎల్, డయామిథాక్సన్ 0.5 గ్రాములు లేదా క్లోరిపైరిపాస్ 2.5ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. తామర పురుగుల నివారణకు స్పైనోసాడ్ 0.25 ఎంఎల్ లేదా పిప్రోనిల్ గోల్డ్ 2.0 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.



అన్నవరంలో మామిడి తోట పరిశీలిస్తున్న అధికారిణి హేమ

సబ్సిడీపై మ్యాంగో కవర్లు

ఉద్యానశాఖ ద్వారా మామిడి రైతులకు మ్యాంగో కవర్లు సబ్సిడీపై అందిస్తున్నామని హెచ్‌వో హేమ తెలిపారు. 50 శాతం రాయితీపై ఎకరానికి నాలుగు వేల కవర్లు చొప్పున అందజేస్తామని, ఒక్కో కవరు రూ.రెండు ఉంటుందని దీనిలో రూపాయి సబ్సిడీ ఉంటుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మొక్కజొన్న, వరి రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించాలి

ఏవో శివశంకర్

చాట్రాయి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న, వరి పండించే రైతులు తప్పకుండా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో శివశంకర్ కోరారు. పోతనపల్లి రైతుసేవా కేంద్రంలో గురువారం ఈక్రాప్ నమోదును ఏవో పరిశీలించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ఈక్రాప్ నమోదు చేయించుకుంటేనే పంటలకు కనీస మద్దతు ధర, ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. భూమి ఉన్న ప్రతి రైతు ఏపీఏఫ్ఆర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మండలంలో ఇప్పటివరకు 8,310 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, మిగిలిన రైతులు రైతుసేవా కేంద్రాలకు వచ్చి చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ పరీక్షలు ప్రశాంతం

చాట్రాయి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో గురువారం ఇంటర్ పస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 142 మంది విద్యార్థులకు గాను 130 మంది హాజరయ్యారని, 12 మంది గైర్హాజరు అయ్యారని ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మాచారి తెలిపారు.